KSR02B110C
ENTERED

నవ్వుని మించిన చిట్కా ఏముంది ?!

ప్రజాశక్తి
ఆదివారం అనుబంధం
ఫిబ్రవరి 28, 2016
స్నేహ

కథా నిలయం
E
శ్రీకాకుళం



సైన్స్

సమాజానికి వెలుగు చుక్కాని

సోనమ్ కపూర్! ఒకప్పటి అసిస్టెంట్ డైరెక్టర్. నేటి బాలీవుడ్ ఫ్యాషన్ ఐకాన్. డిమాండ్ వున్న నటి. అత్యధిక పారితోషికం అందుకుంటున్న తారల్లో ఒకరు. అయితే ఆ విజయాల వెనక ఎంతో కఠోర శ్రమ దాగి వుంది. పట్టుదలతో 35 కేజీల బరువు తగ్గిన ఆ మెరుపు తీగ సినీ ప్రస్థానంలో 'సావారియా, రాంఝూనా, భాగ్ మిల్కా భాగ్, డాలీ కీ ఢోలీ, నీర్జా...' వంటి మైలు రాళ్లెన్నో. కాలు బయట పెడితే చాలు. కెమెరాలు వెన్నాడేంత క్రేజ్ వున్న నాయిక అయినప్పటికీ ... ఖాళీ సమయాల్లో కుటుంబంతో గడపడానికి, కథలు చదవడానికి మొగ్గు చూపుతుంది. ఆమె ఇష్టాయిష్టాలేంటో చూద్దాం....

నవ్వుని మించిన చిట్కా ఏముంది?!

–సోనమ్ కపూర్

ఫిట్‌నెస్ మంత్ర

నా రోజువారీ పనుల్లో వ్యాయామానికి అత్యంత ప్రాధాన్యత వుంటుంది. వారాంతాల్లో సైతం విడిచిపెట్టకుండా చేస్తాను. అయితే ఎప్పుడూ ఒకేవిధంగా కాక... కొద్ది రోజులు యోగా, మరి కొద్ది రోజులు డాన్స్, ఈత చేస్తా. స్క్వాష్ కూడా ఆడతా.

చాకొలెట్ ఇష్టం

చాకొలెట్ అంటే ప్రాణం. అన్ని రకాల చాకొలెట్లనూ ఇష్టపడతా. అయితే బరువు పట్ల శ్రద్ధ వహించాల్సి వస్తున్న దగ్గర నుంచి ... మితంగా తింటున్నా.

కుక్ ... థాయ్...

థాయ్ వంటలను ఇష్టపడతాను. ప్రత్యేకంగా ఒక చోటని కాదుకానీ.... రకరకాల రెస్టారెంట్లలో రుచి చూస్తుంటా.

ప్యాంటూ టీషర్టే

మ్యాక్సీ లేదా ప్యాంటు, టీ షర్టూ వేసుకుంటా. సౌకర్యంగా వుంటాయి కదా. అయితే అదంతా సమయం సందర్భాన్ని బట్టి వుంటుంది. షూటింగ్‌కి వెళ్లేప్పుడు, ప్రయాణంలో వున్నప్పుడు నేను వాటినే ఎంపిక చేసుకుంటాను. అయితే అన్నిట్లోకి వదులు బట్టలే నచ్చుతాయి.

న్యూయార్క్‌కే ఓటు

న్యూయార్క్ నాకు ఇష్టమైన ప్రదేశం. అందుకు ప్రత్యేకంగా ఒక కారణమంటూ ఏం లేదనుకోండి. బహుశా... షాపింగ్ వల్లేనేమో!

రీల్ రొమాన్స్

నాకు ప్రేమకథా చిత్రాలంటే ఇష్టం. 'దిల్ వాలే లే జాయేంగే, టైటానిక్, దేవదాస్, రోమియో అండ్ జూలియట్, గాన్ విత్ ది విండ్'... నా ఫేవరెట్ సినిమాలు.

హ్యాపీ హోమ్

షూటింగ్‌లు లేనప్పుడు ఇంటి పట్టున వుండడానికి ఇష్టపడతా. నాన్న అనిల్, అమ్మ సునీత, చెల్లి రియా, తమ్ముడు హర్ష వర్ధన్‌తో... సందడే సందడి. మేమంతా ఎవరి పనుల్లో వారు బిజీ అయిపోయిన దగ్గర నుంచి ... అందరం కలిసి గడిపే అవకాశం ఎప్పుడు దొరుకుతుందా అని చూస్తుంటాం.

నాన్న అనిల్ కపూర్‌తో...

నవ్వును మించి ఏముంటుంది?

చిరునవ్వుకు మించిన చిట్కా మరొకటి లేదు. సంతోషంగా వుంటే... ఆ మెరుపు మొహంలో ప్రతిబింబిస్తుంటుంది. అందుకే ఎప్పుడూ నవ్వుతూ వుండాలని చెప్తుంటా. అప్పటికప్పుడు అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలంటే మాత్రం ఎరుపు లిప్‌స్టిక్ ఉపయోగపడుతుంది.

'బుక్కు'యిపోతా

చిన్నతనం నుంచీ పుస్తకాలు చదవడమంటే ఇష్టం. వీలు దొరికితే చాలు...చిన్న కథలు చదువుతుంటా. ఫిక్షన్‌ను ఆస్వాదిస్తా. ప్రయాణాలు చేయాల్సి వచ్చినప్పుడు వెంట పుస్తకాలు తీసుకెళ్తుంటా.

కథా నిలయం
KSR 02 B110
ENTERED

మార్గదర్శి

సాహసి నీర్జా

ప్రముఖ జర్నలిస్టు హరీష్ భానోత్-రమ దంపతులది చండీగఢ్. 1962 నాటికి వారికి ఇద్దరు మగ పిల్లలు. ముచ్చటగా మూడోసారి పుట్టిందో బుల్లి యువరాణి. తనే నీర్జా. ఎంత అందంగా వుండేదో అంత సున్నిత మనస్కురాలు. ఎంత సుకుమారంగా వుండేదో అంత సాహసి. వృత్తిరీత్యా హరీష్ కుటుంబం ముంబైకి చేరడంతో నీర్జా చదువంతా అక్కడే పూర్తయింది. ప్రాణప్రదమైన తమ కుమార్తెకు 21 సంవత్సరాలకే వివాహం చేసి అత్తవారింటికి పంపారు. భర్తతో కలిసి గల్ఫ్ వెళ్లిన ఆమెకు సంసార జీవితం చేదు గుళికే అయ్యింది. భర్త వైపు నుంచి అదనపు కట్నం కోసం వత్తిళ్లు పెరగడంతో రెండు మాసాల్లోనే తిరిగి పుట్టింటికి వచ్చేసింది.

మోడల్...

వైవాహిక జీవితం ఒడిదొడుకులకు గురైందని ఏడుస్తూ కూర్చోక తనదైన ప్రపంచాన్ని నిర్మించుకోవాలనుకొంది. అందులో భాగంగానే 'పాన్ ఆమ్' విమాన సంస్థలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకుంది. సెలక్టు కావడం అమెరికాలోని మియామిలో శిక్షణ కోసం వెళ్లడం వెంట వెంటనే జరిగిపోయింది. అయితే దానికి ముందు... మోడలింగ్‌లో ఊపిరిసలపనంత బిజీ. బెంజర్ చీరలు, బినాకా టూత్‌పేస్ట్, గోద్రెజ్ బెస్టో డిటర్జంట్, వేపొరాక్స్, వీకో టర్మరిక్ క్రీమ్ ... లాంటి అనేక వాణిజ్య ప్రకటనల్లో మెరిసిపోయేది. ఈ ప్రకటనల్లో నూతన వధువుగా, బాధ్యతాయుతమైన తల్లిగా, ఉద్యోగస్తురాలిగా, టీనేజీ అమ్మాయిగా...ఎన్ని పాత్రలకు ప్రాణం పోసిందో!

ప్రాణత్యాగం...

అది సెప్టెంబర్ 5, 1986వ సంవత్సరం. ఆ ముందురోజంతా ఒక యాడ్‌లో నటించి వుండడం... మరుసటి రోజే తమ బంగారు తల్లి పుట్టినరోజు కావడంతో... పాన్ ఆమ్‌కు ఫోన్ చేసి సెలవు తీసుకోమని సూచించింది తల్లి. తనకు ఎలాంటి అలసటా లేదంటూనే అమ్మ మాటను సున్నితంగా తిరస్కరించి విధి నిర్వహణకు బయల్దేరింది. పాన్ ఆమ్ - 73 ఎయిర్‌హోస్టెస్‌గా ఆ రోజున విమానంలోకి 360 మంది ప్రయాణీకులకు చిరునవ్వుతో స్వాగతం పలికింది నీర్జా. అందరినీ భద్రంగా గమ్యస్థానం చేర్చాల్సిన బాధ్యత భుజాన వేసుకుని ముంబై నుంచి పాకిస్తాన్‌లోని కరాచీ విమానాశ్రయం చేరిందా విమానం. సరిగ్గా అప్పుడే అనూహ్యంగా జరిగిందో ఘటన. సాయుధ టెర్రరిస్టులు వైమానిక రక్షణ సిబ్బంది దుస్తుల్లో లోపలికి ప్రవేశించి హైజాక్ చేశారు. విషయం తెలిసిన పైలెట్, మరికొందరు ముఖ్య సిబ్బంది ప్రాణభీతితో పరారవడంతో... లోపల మిగిలిన సీనియర్ ఉద్యోగి నీర్జా ఒక్కతే. ప్రయాణీకుల భారం అంతా తనదిగానే భావించి వారిని కాపాడాలనుకుంది. ఈలోగా ప్రయాణీకుల పాస్‌పోర్ట్‌లను సేకరించి ఇమ్మని టెర్రరిస్టులు తనను అడిగినప్పుడు అసలు విషయం అర్థమైంది. వారి టార్గెట్ అమెరికన్లేనని. పాస్‌పోర్ట్‌లను బట్టి ఎవరు అమెరికన్లో గుర్తించడం సులువని గ్రహించింది. పాస్‌పోర్టులు సేకరిస్తూనే అమెరికన్ల పాస్‌పోర్ట్‌లను ఒక చెత్తబుట్టలో వేసేసింది. దాంతో ఎవరు అమెరికన్లో ఎవరు కారో తెలుసుకోవడం చాలా కష్టమైంది టెర్రరిస్టులకు. ఈ గందరగోళంలో 17 గంటలు గడిచిపోయాయి. అలా లాభం లేదనుకున్న ముష్కరులు కాల్పులు మొదలెట్టేశారు. ఆ పరిస్థితుల్లో ఎవరైనా తమ ప్రాణాలు కాపాడుకోడానికే చూస్తారు. అయితే నీర్జా అందుకు భిన్నంగా ఆలోచించింది. ముందుగా బయటపడే అవకాశం తనకే వున్నప్పటికీ ఎమర్జెన్సీ డోర్ తెరిచి ప్రయాణీకులను రక్షించేందుకే ప్రథమ ప్రాధాన్యతనిచ్చింది. అంతేకాక తనకు సమీపంలోనున్న ముగ్గురు చిన్నారులకు రక్షణ కవచంగా నిలిచి తన ప్రాణాలొడ్డింది (వారిలో ఒకరికి అప్పుడు ఏడేళ్లు. నీర్జాని రోల్ మోడల్‌గా చేసుకొన్న బుడతడు ఇప్పుడు పైలెట్). మొత్తం మీద ప్రయాణీకుల్లో 20 మంది మరణించారు. వారంతా భారత్, పాకిస్తాన్, అమెరికా, మెక్సికోకు చెందినవారే.

సాధారణ మధ్యతరగతి కుటుంబంలో పుట్టిందా పుత్తడిబొమ్మ. ప్రాణప్రదంగా చూసుకునే అమ్మానాన్నా, ప్రేమను పంచే అన్నల సంరక్షణలో అపురూపంగా పెరిగిన ఆమె... పరిస్థితుల నుంచే జీవిత పాఠాలు నేర్చుకుంది. ఎదురుదెబ్బలు ఎంత బలంగా తాకినా... ఊహించని పరిణామాలే ఎదురైనా... గుండె నిండా ధైర్యం నింపుకుని సాహసకృత్యాలు చేసింది. వందలాది మంది ప్రాణాలు కాపాడే క్రమంలో ... తీవ్రవాదుల బుల్లెట్లకు తనను తాను బలి ఇచ్చుకుంది.

ఆ సాహస ఘట్టం జరిగిన సంవత్సరం 1986.

అప్పటికామె వయసు 22.

ఆ యువ సాహసి పేరు నీర్జా భానోత్.

పంజాబ్‌లోని ఓ గ్రామంలో ఏర్పాటు చేసిన నీర్జా జ్ఞాపిక

మరో 23 గంటలకు 23వ సంవత్సరంలోకి అడుగెడుతుందనగా ... వందలాది ప్రయాణీకుల ప్రాణాలకు తన ప్రాణం అడ్డు వేసి... తీవ్రవాదుల బుల్లెట్లకు తనను బలిచ్చుకుంది సాహసి నీర్జా.

పరాయి వాళ్ల ప్రాణాలకోసం తన ప్రాణాలను తృణప్రాయంగా ధారపోసిన ఆ యువకిశోరాన్ని భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక అశోక చక్ర అవార్డుతో సత్కరించడంతో పాటు ఆమె జ్ఞాపకార్థం ఒక స్టాంప్‌ను విడుదల చేసింది. అమెరికా ప్రభుత్వం సైతం ఆమె సాహసకృత్యానికి పలు అవార్డులను అందించింది. పాక్ ప్రభుత్వం 'తమ్గా-ఏ-ఇంసనియాట్'తో సత్కరించింది.

(నీర్జా సాహస గాధ ఆధారంగానే సోనమ్ కపూర్ టైటిల్ పాత్రధారిణిగా రామ్ మధ్వానీ 'నీర్జా' చిత్రం వెలువడింది.)

స్టార్................. 3
చూపులతో కాదు
మాటలతో పడేయాలి
యువ................. 4
ఆటో రూబీ...
కార్టూన్ పంచ్......... 5
హాబీ............. 10
మల్టీ హాబీ స్టార్
తెలుసా............... 11
అరటి హోయి...హోయి

ఇండెక్స్

సైన్స్
సమాజానికి వెలుగు చుక్కాని



అట్టమీది కథ.........6

స్ఫూర్తి....12
బ్లాక్ మాంబా దళం
నా కళ్ళతో..............14
దీవిలో. ఒంటరిగా.. 19 రోజులు..
వింతలోకం.............16
భార్యకు ప్రేమతో..
కథ.....................18
అంతిమం
రుచి.....................21
పొట్లకాయ వెరైటీలు
బాల నేస్తాలు...........22
పేపర్ ప్లేట్ చేపలు
పదవికాసం.............24

నిజాయితీగా వుండడం కష్టం

'కచ్చితమైన కలెక్టర్' వ్యాసం చాలా బాగుంది. నీతిగా, నిజాయితీగా తన బాధ్యతను నిర్వర్తించడం ఎంత కష్టమో ఈ కలెక్టర్‌ను చూస్తే అర్థం అవుతుంది. తను నమ్మిన సిద్ధాంతాన్ని తాను ఎన్నడూ మరవకుండా మకుటం లేని కలెక్టర్‌గా తన బాధ్యతలను నిర్వర్తించిన సగాయాన్ని అభినందించకుండా వుండలేం. నేటి కలెక్టర్లకు ఇతనొక దిక్సూచిగా నిలుస్తాడు. కమల్ హాసన్ పేరు తెలియని వారుండరు. నాస్తికత్వమే తన ఆస్తిగా భావించే కమల్ తన కూతురిద్దరి జనన పత్రాల్లో మతం కేటగిరిని ఖాళీ చేసి వాళ్లకు స్వేచ్ఛను కల్పించడం ఆనందించదగ్గ విషయం.

అమర్, వల్లూరు

తెలియని ఎన్నో విషయాలను తెలుసుకుంటున్నాం.

సరస్వతి, యర్రగుంట్ల

నయనానందం

తాము గీసిన చిత్రాల్లో హావభావాలు పలికించడంలో ఒక్కొక్కరిది ఒక్కో ప్రత్యేకత. కాని కళ్లను మాత్రమే గీసి వాటిలోని భావాలను పలికించగలడు మార్సీన్జ్. పుట్టుకతోనే తన చేతులు సరిగ్గా అభివృద్ధి చెందకపోయినా .... బుర్రలో పోగుబడిన తెలివితో తనకు ప్రావీణ్యం ఉన్న కళతో సమాజానికి, తనలాంటి వారికి స్ఫూర్తినివ్వడం నిజంగా అభినందనీయం. మారుతున్న నగర జీవనానికి ఉపయోగపడే భవన నిర్మాణాలు నేడు రెడీమేడ్‌గా మారుతున్నాయి. సైన్స్, టెక్నాలజీ ప్రజలకు అందుబాటులోకి వస్తే ఇలాంటి అద్భుతాలెన్నో కళ్లెదుట నిలుస్తాయి.

శివ, విజయవాడ

పరివర్తన తేవాలి

నాలుగు గోడల మధ్య శిక్షను అనుభవిస్తున్న ఖైదీలు తమ శిక్షణా కాలం పూర్తి చేసుకుని సమాజంలో ఎలా బతకగలరు? ఎవరు వారిని చేరదీస్తారు. అలా కాకుండా ఖైదీల్లో పరివర్తనతో వారిలో మార్పును తీసుకువచ్చి తగు రంగంలో శిక్షణిచ్చి వారిని సమాజం గర్వించదగ్గ విధంగా చేయటంలో జైళ్ల శాఖ చొరవ చూపాలి. 'తెలుసా' అంటూ మాకు

లవ్ సోల్జర్స్

ఎదుటి వ్యక్తి మనుసును గెలుచుకోవడం ఎంతటి కష్టమైన పనో అందరికీ తెలుసు. అటువంటిది అమ్మాయి మనుసును గెలుచుకొని పెద్దల్ని ఎదిరించి వివాహం చేసుకోవాలంటే సాహసమే చేయాలి. మన సినీ హీరోలు తమ ప్రేమ ప్రయాణాన్ని పెళ్లి వరకు తీసుకెళ్లారు. వారందరిని గుర్తు చేసినందకు సంతోషం. ప్రేమను గెలిపించుకోలేక ఎంతో మంది ప్రేమికులు తమ ప్రాణాలను బలి తీసుకుంటుంటే మనసు పిండేస్తుంది. అలాంటి కొందరికైనా లవ్ కమెండోలు పెళ్లి చేయడం అభినందించదగ్గ విషయం. ఈ వారం కార్టూన్లు బాగున్నాయి. కాగితం విగ్గులు ఆశ్చర్యాన్ని కలిగించాయి.

రాము, కడప

యాత్ర

పిచ్చి వెయ్యి రకాలు అన్నట్టు ఎవరి పిచ్చి వారికి ఆనందంగా ఉంటుంది. అలాంటిదే ప్రపంచ పర్యటన చేస్తున్న ఒక హెయిర్ స్టైలిస్ట్ తన పిచ్చిని జనాల మీద చూపుతూ ప్రపంచాన్ని ఆకర్షిస్తున్నాడు. పిల్లి పిల్లను అంటూ తనే పిల్లిలాగా మారిపోవడం వింతగా ఉంది. మూగ జీవాలకు అంకితం అనే వ్యాసం చాలా బాగుంది. తన ఆస్తినంతటిని అమ్మి ఇలా మూగజీవాల కోసం కష్టపడటం నిజంగా అభినందించదగ్గ విషయం

యల్లారెడ్డి, కొమ్మలూరు, కడప

సంచికపై మీ అభిప్రాయాలను పంపాల్సిన చిరునామా: స్నేహ, ప్రజాశక్తి, డోర్ నెం: 27-30-4, ఆకుల వారి వీధి, గవర్నర్ పేట, విజయవాడ.-520002.
మెయిల్ అడ్రస్: snehaweekly.praja@gmail.com

చూపులతో కాదు మాటలతో పడేయాలి

అర్జున్ కపూర్ 'కీ అండ్ కా'తో వయసులోనే కాదు, అనుభవంలోను, స్టార్‌డమ్‌లోను తనకు సూపర్ సీనియర్ అయిన కరీనా కపూర్‌తో జంటగా నటిస్తున్నాడు. బాలీవుడ్‌లో ఇదో కొత్త అడుగు. అనిల్ కపూర్, బోనీ కపూర్ వారసుడిగా పరిచయమైనా తొలి చిత్రాన్ని కేవలం కుటుంబం ఎఫెక్ట్‌తో కొట్టేయలేదు. యువతుల హృదయాల్ని కొల్లగొట్టిన వర్ధమాన నటుల్లో ఒకడు. నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రలతో సాహసాలు చేస్తూ తనకంటూ ఓ ప్రత్యేకతను నిలుపుకుంటున్నాడు. ఇషక్‌జాదేతో తెరంగేట్రం చేసి 'ఔరంగజేబ్, గూండే, టూ స్టేట్స్, ఫైండింగ్ ఫ్యానీ, తేవార్'తో ఒక్కో శైలిలో అభిమానుల్ని ఆకట్టుకున్నాడు. దర్శకుడవుదామని అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసిన అర్జున్ సెట్లో ప్రియాంక చోప్రాకు షాట్ రెడీ అయ్యిందని చెప్పొచ్చేవాడు. అలాంటి అర్జున్ సరసన ప్రియాంక హీరోయిన్‌గా మారింది.

- **మ**హేష్ బాబు 'ఒక్కడు' హిందీ రీమేక్ 'తేవార్'కు తండ్రి బోనీ కపూర్‌తో కలిసి తొలి ప్రాజెక్ట్ చేశాడు అర్జున్ కపూర్.
- చిన్నప్పటి నుంచి సినిమాపై మోజు పెంచుకున్న అర్జున్ ప్రొడక్షన్ వ్యవహారాల్లో తండ్రికి సాయంగా ఉండేవాడు. క్రియేటివ్ డిస్కషన్స్‌లో ఉత్సాహం చూపేవాడు.
- హెచ్ఎస్సీతో చదువు ఆపేసి పూర్తిగా సినిమాకే అంకితమైపోయాడు. 17 ఏళ్లపుడు ధర్మ ప్రొడక్షన్‌కు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి తొలి పే చెక్ అందుకున్నాడు.
- నానా పటేకర్, షారుక్ ఖాన్ నటించిన 'శక్తి' సినిమా ట్రైలర్లను రూపొందించి తండ్రి దగ్గర మంచి మార్కులు కొట్టేశాడు.
- అర్జున్ తల్లి మోనా శౌరీ కపూర్ ఫ్యూచర్ స్టుడియోస్‌కు సీఈవోగా సారథ్యం వహించారు. 'షీషా', 'ఫరిస్తే' చిత్రాలకు ప్రొడక్షన్ కోర్డినేటర్‌గా వ్యవహరించడమేకాక పలు సీరియళ్లను నిర్మించారు.
- అర్జున్‌కు పదేళ్లు, అన్షులాకు ఐదేళ్లున్నప్పటి నుంచి సింగిల్ పేరెంట్‌గా మోనా పెంచి పెద్దచేసింది. అన్నీ అయిన తల్లంటే అర్జున్‌కు ప్రాణం. క్యాన్సర్‌తో పోరాడి మరణించిన ఆమె నిష్క్రమణం అర్జున్ జీవితంలో కోలుకోలేని దెబ్బ.
- అర్జున్‌ను స్టార్ హీరోగా చూడాలనుకునేది మోనా. తల్లి ఆశలను సజీవం చేస్తూ 'ఇషక్‌జాదే'తో గ్రాండ్ ఎంట్రీ ఇచ్చాడు బాలీవుడ్‌లో. కానీ, చిత్రం విడుదలకు కొద్ది రోజుల ముందే మోనా చనిపోయింది.
- తండ్రి మిత్రురాలు, కుటుంబ సన్నిహితురాలు అయిన నటి షబానా అజ్మీనే ఒంటరి వాళ్లయిన అర్జున్, అన్షులాను అక్కున చేర్చుకుని విషాదం నుంచి మెల్లిగా బయటపడేలా చేసింది.
- న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన బార్నార్డ్ కాలేజ్ టాపర్లలో ఒకరిగా అన్షులా నిలిచి తల్లి కోరిక నెరవేర్చింది. కానీ, ఆమె గ్రాడ్యుయేషన్ సెరెమొనీ సమయంలోనే తన తొలి చిత్రం ప్రచార కార్యక్రమాల్లో చాలా బిజీగా ఉన్నాడు అర్జున్. చెల్లెలి కార్యక్రమానికి హాజరకాలేకపోవడం ఎప్పటికీ వెలితేనంటూ పలు సందర్భాల్లో చెప్పాడు. అన్షులా మాత్రం అర్జున్‌కు సంబంధించిన అన్ని కార్యక్రమాల్లో ముందుంటుంది.
- అనిల్ కపూర్ కూతురైన సోనమ్ అర్జున్‌కు తల్లిలాంటి సోదరి. అర్జున్ ఏ విషయమైనా ముందు సోనమ్‌తో చర్చించాకే నిర్ణయం తీసుకుంటాడు. కానీ సినిమా వ్యవహారాల్లో మాత్రం జోక్యం చేసుకోరు.
- హీరోగా తెరంగేట్రం చేయకముందు అర్జున్‌ది 140 కేజీల స్థూలకాయం. తన తొలి చిత్రం 'ఇషక్‌జాదే' కోసం 50 కేజీలు బరువు తగ్గాడు. అర్జున్‌కు ఓ నిక్‌నేమ్ ఉంది. అది భారీకాయులకు వస్త్రాలను రూపొందించే బ్రాండ్ 'పూబూ'. బొద్దుగా ఉన్న అర్జున్‌ను స్కూల్లో అలా పిలిచేవారట. ఇప్పటికీ కరణ్ జోహార్, ప్రియాంక చోప్రా అర్జున్‌ను అలానే పిలుస్తారు.
- ఎంత అందంగా ఉన్నా మూడు నిమిషాలు కూడా మాట్లాడలేని అమ్మాయిలతో అస్సలు కూర్చోడు. తనకు అమ్మాయి నచ్చాలంటే ఇంటలెక్చువల్ అయ్యిండాలి అని అంటాడు. చూపుల్తో కాకుండా మాటల్తో అర్జున్‌ను తేలికగా పడేయొచ్చట.
- అర్జున్‌కు సీలింగ్ ఫ్యాన్లంటే కాస్త భయముందట. ఆరడుగుల రెండు అంగుళాల ఎత్తుండే అర్జున్ తలను కిందకనడం, చేతులు పైకి చాపేపుడు చూసుకోవడం అలవాటైపోయాయట... సీలింగ్ ఫ్యాన్లున్నా లేకున్నా.
- చెప్పులు, ట్రాక్ ప్యాంట్లంటే అర్జున్‌కు మహా ఇష్టం. స్యూట్లు లేకున్నా అవుంటే చాలు.
- అర్జున్‌కు అత్యంత సంతోషాన్నిచ్చేది కెమెరా ముందు ఉండటం. షెడ్యూల్ ఎంత హెవీగా ఉంటే అంత ఆనందంగా గడిపేస్తాడు.



ఆరేళ్ల క్రితం ఓ పాతికేళ్ల అమ్మాయి ఆటో నడుపుతానన్నప్పుడు...తండ్రి మండిపడ్డాడు. పైగా అది ఆడాళ్ల పని కాదని...మగాళ్ల పనని తేల్చి చెప్పేశాడు. ఒకవేళ తన మాట కాదని ఆటో ఎక్కితే కనక...ఆపైన ఇంటి గడప తొక్కొద్దన్నాడు. భర్త వైపు నుంచీ సానుకూల స్పందన కరవైంది. బంధువుల నుంచీ సూటిపోటి మాటలే వెలువడ్డాయి. అయినా సరే వేటినీ లెక్కించక... ధైర్యంగా ఆటో స్టీరింగ్ పట్టి... కుటుంబానికి కీలక ఆదాయ వనరుగా మారిందా యువతి. పోకిరీల వేధింపులు ఎదురైనా... పోలీసుల దోపిడీకి గురైనా... అదరక బెదరక కుటుంబాన్ని పోషిస్తున్న రూబీ సింఘాల్ జీవితంలో ఎన్నో మలుపులు...మరెన్నో కుదుపులు.

ఆటో రూబీ...

ఉత్తరప్రదేశ్...ఘజియాబాద్‌లో 'ఆటో రూబీ' అనడిగితే చాలు. ఎవరైనా చెప్పేస్తారు ఆమె చిరునామా. ఆ ఏరియాలో వున్న ఏకైక మహిళా ఆటో డ్రైవర్ కావడంతో తనకు అంత గుర్తింపు వుంది. ముగ్గురు పిల్లలు. భర్తకు అంతంత మాత్రపు ఆదాయం. ఆటో నడుపుతూ ఇద్దరూ సంపాదిస్తేనే ఇల్లు గడుస్తుంది. ఇప్పటికీ మగవాళ్లకే పరిమితమైన ఆటో ఫీల్డును ఎంచుకోవడంలోనే రూబీ ధైర్యసాహసాలు వ్యక్తమౌతాయి. అటు అమ్మానాన్నలుగానీ ఇటు భర్త కుటుంబంగానీ కడు పేద కుటుంబాలు. రెక్కాడితేకానీ డొక్కాడదు. అలాంటి కుటుంబంలో పుట్టిన రూబీ కుతూహలం కొద్దీ మొదట స్కూటర్ నడపడం నేర్చుకుంది. ఆ తర్వాత బైక్...ఆపైన ఆటో. మొదట ఆటో లైసెన్స్ ఇవ్వడానికి అధికారులు నో చెప్పడంతో స్కూటర్ లైసెన్స్ మీదే లాగించేసేది. ఆ తర్వాత ఓ జర్నలిస్టు సాయంతో ఎట్టకేలకు పొందగలిగింది.

గడప తొక్కొద్దన్న తండ్రి

ఆటో నడుపుతాననప్పుడు తండ్రి పెద్ద రాద్ధాంతమే చేశాడు. అరచి గోల చేశాడు. తన ఇంటికి రావద్దన్నాడు. అయితే తమ్ముళ్లే ఆమెకు అండగా నిలిచి ప్రోత్సహించారు. సెకండ్ హ్యాండ్ ఆటో కొనుక్కోవడానికి కావాల్సిన డబ్బు ఏర్పాటు చేశారు. ఇక చుట్టుపక్కల వారి వ్యంగ్యాస్త్రాల సంగతి చెప్పేదే లేదు. పోకిరీలైతే ... ఈలలు, వంకర మాటలు ... వారి గురించి ఎంత చెప్పుకున్నా తక్కువే. కొందరు ప్యాసెంజర్లు ఆటో ఎక్కి గమ్యస్థానం చేరాక డబ్బులివ్వకపోగా... ఆమె గురించి అసభ్యంగా మాట్లాడేవారు. అయితే అల్లరిమూకకు గట్టి సమాధానం ఇవ్వడంలో రూబీ మాంచి దిట్ట. అవసరమైతే వారికి దేహశుద్ధి చేయడానికి కూడా వెనకాడదు. పోలీసులు సైతం మామూళ్లు పేర తన సంపాదన అంతా లాగేసుకున్న ఘటనలూ వున్నాయి. ఇంటికొచ్చి పెద్దపెట్టున ఏడ్చినా... మరునాడు పొద్దున్నే యథాతథంగా ఆటో ఎక్కేసేది. తన చిన్న కొడుకు కడుపులో పడ్డప్పుడు నిష్ట దరిద్రంలో వుందా కుటుంబం. నొప్పులు వచ్చినప్పుడు కూడా ఆటో నడుపుతూనే వుంది. బిడ్డ పుట్టాక నెల రోజులకు ... ఆ చిన్నారిని చీరలో చుట్టి భుజాన తగిలించుకుని... తిరిగి పనిలో చేరిపోయింది. కొంతమంది ప్యాసెంజర్లు తల్లీబిడ్డల బాధ చూడలేక చంటోడిని ఎత్తుకునేవారు.

అమ్మ మనసు...

ప్రస్తుతం వారి ముగ్గురు పిల్లలూ స్కూళ్లకెళ్తున్నారు. వాళ్ల ఫీజులు, తిండి, బట్ట గడవడమంటే మాటలు కాదు. రోజుకి ఆరు గంటలపాటు ఆటో నడుపుతుంది. వచ్చిన ఆదాయం సరిపోదనుకుంటే ఆ సమయాన్ని పొడిగిస్తుంది. సాధారణంగా ఆదివారాలు ఇంటి పట్టునే వుండి ఆ రోజంతా పిల్లల కోసమే కేటాయిస్తుంది. అయినప్పటికీ అదేం రూలు కాదు. ఒక్కోసారి ఆరోజు కూడా ఆటో నడిపేస్తుంది. అయితే ప్యాసెంజర్ల ఎంపికలో ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటుంది. దాంతో ఆదాయం తతిమ్మా ఆటోవాలాలకు వున్నంత వుండదు. హైస్కూలు చదువు కూడా పూర్తి చేయని రూబీ పిల్లల చదువు పట్ల చాలా శ్రద్ధ తీసుకుంటుంది. వాళ్లు తనలా ఆటో నడపకూడదన్నది ఆమె పట్టుదల. పెద్ద చదువులు చదవాలని, ఉద్యోగాలు చేయాలని కోరిక. ఆ పిల్లలకు కూడా రూబీ అంటే చెప్పలేనంత ప్రేమ. అమ్మ ఫొటో పత్రికల్లో పడినప్పుడు, ఆమె గురించిన కథనాలు అచ్చయినప్పుడు ఆ చిన్నారుల సంతోషానికి హద్దే వుండదు. మూడేళ్ల కిందట రూబీ భర్త కూడా తన చిరు వ్యాపారం ఎత్తేసి ఆటోవాలాగా మారిపోయాడు.

ఆటో కాలిపోయినా అదరలా బెదరలా

ఈ ఏడాది ప్రారంభంలో ఓ చేదు ఘటన ఎదురైంది రూబీ కుటుంబానికి. రాత్రుళ్లు తమ రెండు ఆటోలను ఇంటి బయట పెడుతుంటారు. ఓ తాగుబోతు ఆర్ధరాత్రిపూట పెట్రోలు పోసి వాటిని తగలబెట్టేశాడు. కుటుంబానికి ఆ ఆటోలే ఆధారం. అవే కాలిబుగ్గయిపోతే...ఇక కుటుంబం గడిచేదెట్లా! పోలీస్‌స్టేషన్‌కెళ్లి తన గోడు వెళ్లబోసుకుంటే... వారు పెదవి విరిచారు. యాక్సిడెంట్ అయిన ఆటోలకు మాత్రమే సాయం చేయగలమని... ఇలా కాలిపోయిన వాటికి ఏమీ చేయలేమని తేల్చేశారు. అయితే పెద్ద మనసున్న కొందరు సాయం చేయడంతో ... పాత ఆటో కొనుగోలు చేసి తిరిగి ఆటోస్టాండ్‌లో బండిని నిలబెట్టగలిగింది రూబీ. ఈలోగా... రాష్ట్ర ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్ కూడా స్పందించి ఆమెకు కొత్త ఆటో ఇవ్వడంతో కథ సుఖాంతమైంది.

✦

కార్టూన్ పంచ్



నవ్వుల్- పువ్వుల్

నాకూ... ఇలాగే...

భార్య వంట చేస్తోండగా ఆకస్మాత్తుగా కిచెన్‌లోకి దూసుకొచ్చాడు సుబ్బారావు.

ఆమ్లెట్ వేయడం అలా కాదు...ఇంకొంచెం నూనె పోయి.. ఆగు..ఆగు...

మరీ అంత పోస్తే...ఎలా?

అయ్యో..! ఆమ్లెట్ మాడిపోతుంది. తిప్పు తిప్పు..ఇంకా ఎంతసేపు..

ఇపుడు కొంచెం ఉప్పు వెయ్యి...!

అయ్యో..అయ్యో.. మరీ అంతనా పోసేది?

సుబ్బారావు మాటలతో అతని భార్యకు చిర్రెత్తుకొచ్చింది.

భార్య: అసలు నా గురించి మీరేమనుకుంటున్నారు? ఈ రోజే కొత్తగా చేస్తున్నట్లు మీ అరుపులేంటి

సుబ్బారావు: నేను డ్రైవింగ్ చేస్తున్నప్పుడు నువ్వు అరిస్తే.. నాకూ ఇలానే ఉంటుంది.

అక్కడికి!

ట్రైన్ టి.టి : ఎక్కడికి వెళ్ళాలి?

బాబా: ఎక్కడైతే రాముడు జన్మించాడో...అక్కడికి

టి.టి: టికెట్ ఉందా?

బాబా: లేదు

టి.టి: అయితే పద..

బాబా: ఎక్కడికి

టి.టి: ఎక్కడైతే కృష్ణుడు జన్మించాడో...అక్కడికి.

అన్యాయం

ఇది మరీ అన్యాయం రేపట్నుంచి నేను స్కూలుకు వెళ్ళను అన్నాడు ఆరేళ్ళ ప్రమోద్.

అంత అన్యాయం ఏం జరిగిందిరా? నవ్వుతూ అడిగాడు తండ్రి.

లేకపోతే మా టీచరేమో పుస్తకం చూస్తూ పాఠం చెబుతుంది. మమ్మల్ని మాత్రం చూడకుండా పాఠం అప్పజెప్పమంటుంది. అన్నాడు ప్రమోద్.



సైన్స్

సమాజానికి వెలుగు చుక్కాని

- నాగసూరి వేణుగోపాల్
9440732392

మృగప్రాయంగా లేదా ఇంకా అధ్వానంగా చీకటికీ, వానకూ, మెరుపుకు, ఉరుముకు బెదిరిపోయిన ఆదిమానవునికి వెలుగు చుక్కానిగా దారి చూపింది సైన్స్ మాత్రమే! చీకటి పోక, వెలుగు రాక వంటి ప్రాకృతిక విషయాలను పరిశీలించి వాటిలో గల క్రమానుగత మార్పులను గమనించి ఎన్నో విషయాలను క్రమంగా ఆకళింపు చేసుకున్నాడు. అలా పరిశీలన, అధ్యయనంతో మనిషి నాగరిక మనిషిగా పరిణామం చెందాడు. ఈ విధమైన మనిషి విస్తరణే సైన్స్ గమనం, శోధన, సాధన! అప్పటి కాలంలో దీన్ని సైన్స్‌గా పిలిచి ఉండకపోవచ్చు. కానీ జాగ్రత్తగా పరిశీలించి తద్వారా గడించిన అనుభవంతో ప్రకృతి మీద ఆధిపత్యానికి మనిషి ప్రయత్నించాడు. పడవకు తెర చాప కట్టాలనే ఆలోచన అలా వచ్చినదే. ప్రకృతిని అధ్యయనం చేసి గాలి దిశను వినియోగించి ప్రయాణం చేయాలనుకోవడం వల్ల వచ్చిన ఆలోచన అది. మనిషి అవసరాలేంటి? ఉన్న వనరులను అనుకూలంగా మలచుకోవడం ఎలా? అనే ప్రశ్నల ద్వారా ఏ మానవ ప్రయత్నమైనా ఉంటుంది. ఒకప్పుడు కలరా, మశూచి, ప్లేగు, క్షయ వంటి రోగాలు ప్రపంచాన్ని గడగడలాడించాయి. క్రమంగా వైద్య శాస్త్రం ఈ అనారోగ్య సమస్యలకు పరిష్కారం చూపగలిగింది. ఒకప్పుడు సంచార జీవితం సాగించిన మనిషి రేపు అంగారక గ్రహం

... అలా ఉండి ఉంటే ఇలా చర్చించుకునే వీలుండేది కాదు. అలా కాక మరోలా ఉంది కనుకనే సమస్య! కష్టపడే వారికన్నా కబుర్లు చెప్పే వారికే ప్రచారం, విలువ! అలాగే అనుకోవాల్సి వస్తోంది! మానవాళికి ఎక్కువ దోహదపడింది శాస్త్ర విజ్ఞానమే! రోగాలు తగ్గించి మనిషి ఆయుర్దాయం పెంచడం... తక్కువ మానవ శ్రమతో ఎక్కువ ప్రయోజనం పొందడమనేది సైన్స్ ద్వారానే సాధ్యమైంది. ఇలా చాలా చెప్పుకోవచ్చు. కానీ నేడు సైన్స్ ఎవరికీ కొరక రాని అంశమైంది! సైన్స్ కారణంగా రూపొందించబడిన టెక్నాలజీ నేడు ఆకర్షణీయమైన వాణిజ్యం! నాలెడ్జి సొసైటీ, ఇన్‌ఫర్‌మేషన్ సొసైటీ అంటూ చెప్పుకుంటున్నాం కానీ మన సమాజంలో ఉండే సమాచారం ఏమిటో నాలెడ్జి ఎవరికీ బోధపడటం లేదు. నిజానికి సైన్స్ భావన అనేది గొప్ప సార్వత్రిక వ్యవహారం. ప్రజాస్వామిక ధోరణి. సైన్స్ సందర్భాన్ని బట్టి మాట మార్చదు. అధికారానికి లొంగదు! దాన్నే సైన్స్ బాట అంటాం!

మీదనో మరో చోటనో మకాం వేయగలుగుతున్నారంటే దానికి కారణం సైన్స్ !

సైన్స్ - టెక్నాలజీ

శాస్త్రవేత్త, గొప్ప స్ఫూర్తిప్రదాత అయిన మాజీ భారత రాష్ట్రపతి ఎ.పి.జె అబ్దుల్ కలాం తన ఆత్మకథల్లో ఒక చోట సైన్స్, టెక్నాలజీకి వున్న తేడాలను చాలా చక్కగా వివరించాడు. సైన్స్ అనేది వైయుక్తిక ప్రయత్నం. టెక్నాలజీ అనేది ఎక్కువ మంది కలిసి సాధించే సమన్వయ ఫలితం. ఇది అబ్దుల్ కలాం భావన. ఇంటి నిర్మాణానికి సంబంధించి తొలుత తయారు చేసుకునే ప్లాను సైన్స్ అయితే... నిర్మించడం టెక్నాలజీ. ఈ రెండు దశల మధ్య ఉండేది ఇంజినీరింగ్. టెక్నాలజీ ఫలితం కనుక, టెక్నాలజీ ద్వారా లబ్ధి పొందవచ్చు కనుక, టెక్నాలజీ అంటే అందరికి (వాస్తువేత్తలకైతే మరీను) ఆసక్తి, నమ్మకం, అసరా! జె.జె. థామ్సన్ ఎలక్ట్రానును ఆవిష్కరించాడు. దాని వల్ల ఆయన ప్రత్యేకంగా పొందింది ఏమీ లేకపోవచ్చు. కానీ నేడు చూడండి ఎలక్ట్రానిక్స్ ఎంత పెద్ద స్థాయి పరిశ్రమగా విస్తరించిపోయిందో! అందుకే ఆదిలో కృషి చేసే శాస్త్రవేత్తలను రుషులతో పోలుస్తారు. నేటి యుగము వేరు, నేటి రుషులు వేరు! ఎలాంటి స్వప్రయోజనాలు ఆశించకుండా కొనసాగించేదే సైన్స్!

ఓల్డేజీ హోమ్‌లో సైన్స్

ఈ మాట వినడానికి ఇబ్బందిగా ఉండవచ్చు. వాస్తవం చూస్తే ఇలాగే ఉంది! తల్లి తండ్రులు ఎంతో కష్టపడి తమ పిల్లలకు అన్నీ అమర్చుతారు. ఆనందింపచేస్తారు. కానీ అదే పిల్లలు పెద్దయ్యాక తమ పిల్లల బాగోగుల కోసం శ్రమిస్తారు గానీ పెద్దల గురించి ఆసక్తి చూపరు.

ఒక్కో సంవత్సరం ఒక్కో లక్ష్యం

జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం ప్రతి సంవత్సరం ఏదో ఒక లక్ష్యంతో జరుపుకుంటున్నాం... 2016 నేషనల్ సైన్స్ డేకు థీమ్ 'మేక్ ఇన్ ఇండియా: సైన్స్ అండ్ టెక్నాలజీ డ్రివెన్ ఇన్నోవేషన్స్'. ఈ ఉద్దేశానికి అనుగుణంగా దేశంలోని విద్యాసంస్థలు, పరిశోధన సంస్థ కార్యక్రమాలు రూపొందించి ప్రచారం చేస్తాయి. సైన్స్ పట్ల, సైన్స్ కోర్సుల పట్ల, సైన్స్ పరిశోధనల పట్ల ఆసక్తిని, గౌరవాన్ని పెంచడానికి పరిశోధనా సంస్థలు ప్రజలను ఆహ్వానించి సైన్స్ విషయాలను వివరిస్తాయి.

అందుకనే ఈ వృద్ధాశ్రమాలు లెక్కకు మించి పెరిగి పోయాయి. నేడు సైన్స్ పరిస్థితి కూడా అలాగే ఉంది. సైన్స్ కారణంగా రూపొందించబడిన టెక్నాలజీ వాణిజ్య సంపదగా మారిపోయింది. వాణిజ్యాన్నే కాదని ప్రతి రంగాన్ని శాసిస్తోంది. ఇంకా మాట్లాడితే ప్రపంచ రాజకీయాలను కట్టడి చేస్తుంది. ఇప్పుడు సోలార్ అంటూ ప్రచారం జరిగినట్లు సుమారు దశాబ్దం క్రితం హెచ్ఐవి/ఎయిడ్స్ గురించి వినిపించేది. ఇలాంటి ప్రచారాలకు అంతర్జాతీయ రాజకీయాలు కారణమనీ ఆ రాజకీయాలు టెక్నాలజీ ద్వారా జరుగుతాయని అంటుంటారు. అలా ఊదరగొట్టి సంబంధింత టెక్నాలజీని అమ్మడం వారి

సైన్స్ డే నేపథ్యం

సైన్స్‌ది ఎప్పుడూ ముందు చూపే. 1991 నుంచి టెక్నాలజీ వ్యాప్తి, అనర్థాలు బాగా పెరిగాయి. కానీ 1987 నుంచే మన దేశం జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవం జరుపుకుంటోంది.1888 నవంబర్ 7న సి.వి.రామన్ జన్మించారు. వారి శత జయంతి సందర్భంగా రామన్ ఎఫెక్ట్ ఆవిష్కరించబడిన ఫిబ్రవరి 28వ తేదీని జాతీయ విజ్ఞాన శాస్త్ర దినోత్సవంగా జరుపుకోవడం మొదలైంది. ఒక వారం పాటుగానీ, ఒక నెలగానీ ఫిబ్రవరి 28లో మొదలు కావడం గానీ, ముగియడం గానీ జరిగే రీతిలో వివిధ కార్యక్రమాలు రూపొందుతుంటాయి. అయితే అదే రోజు బడ్జెట్ రోజు కావడంతో పత్రికలకు, చానళ్లకు సైన్స్ డే పట్ల ఆసక్తి ఉండదు. కనుక సైన్స్ డే విద్యార్థులకూ, పాఠశాలలకు, విద్యాసంస్థలకు సంబంధించిన వ్యవహారంగా మారిపోయింది. ఈ సంవత్సరం ఫిబ్రవరి 28 ఆదివారం కావడంతో పరిస్థితి కొంత మెరుగు.

వ్యూహమని విమర్శకులు వివరిస్తుంటారు. ఇలా ఎంతో ప్రాధాన్యత గడిస్తున్న టెక్నాలజీ చాటున నేడు సైన్స్ మరో నల్ల పూస అవుతోంది. ఇప్పుడు విశ్వవిద్యాలయ స్థాయిలో కూడా మౌలిక శాస్త్రాలకు సంబంధించిన కోర్సులు అనాకర్షణీయంగా మారిపోతున్నాయి. సంబంధిత రంగాల్లో పరిశోధన కూడా దెబ్బ తింటోంది.

నిజానికి ఓల్డేజి హోంలో పెద్దల మాదిరి సైన్స్ రంగం నేడు అనాదరణకు గురవుతోంది. తక్షణ ఫలితం అందుబాటులో లేదనే భావనతో కొంత కాలంగా బిఎస్సీ, ఎంఎస్సీ, పి.హెచ్.డి కోర్సులు డిమాండు లేకుండా పోతున్నాయి. మౌలిక పరిశోధన దెబ్బ తింటే ముందు ముందు చాలా ప్రమాదం. ఈ ప్రమాదం కేవలం సైన్స్‌తోనే ఆగదు. సైన్స్ పరిశోధన ఎంత పరిపుష్టంగా ఉంటే తర్వాతి రోజుల్లో టెక్నాలజీ ఆ స్థాయిలో వృద్ధి చెందుతుంది. అందవల్లనే సైన్స్ చదువు పట్ల, సైన్స్ కోర్సుల పట్ల, సైన్స్ పరిశోధన పట్ల ప్రజల దృష్టి మళ్ళించాలనే ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. ఈ రకమైన అవగాహన పెంచే దిశలో రకరకాల కార్యక్రమాలు జరగడం పలు కొత్త విద్యాసంస్థలు రావడం ఇటీవల కాలపు పరిణామాలు!

ఎలక్ట్రానిక్స్.. కంప్యూటర్స్.. ఐటి..

థామ్సన్ మహాశయుడు ఎలక్ట్రానును





కనుగొన్నప్పుడు దాని వల్ల భవిష్యత్తులో ఏమేం ప్రయోజనాలు కలుగుతాయో కూడా కనీసం ఊహించి ఉండడు. పరిశోధన అలా ఉంటుంది. పాతికేళ్ళ క్రితం ఎలక్ట్రానిక్స్ అనడం ఫ్యాషన్. తర్వాత కంప్యూటర్. నేడు ఐటి. మరి కొంత కాలం తర్వాత ఐటి పదానికి ముందో వెనుకో ఏదో మంచి పదం వచ్చి చేరి చెలామణీలోకి వస్తుంది. ఏదో ఒక కోర్సు చేసి విమానం ఎక్కి డాలర్లు సంపాదించాలనే ధోరణి పెరిగింది. దీనికి యువతను పూర్తిగా తప్పు పట్టలేం. ఉపాధి కలిగినప్పుడు దాని మీద గౌరవం కలగడంలో ఆశ్చర్యమేం లేదు! అయితే పళ్ళు తినాలనే ఆసక్తి అందరికీ ఉండవచ్చు. కానీ ఆ పళ్ళు రావాలంటే ఎవరో ఒకరు అంతకుముందే చెట్టును పెంచాల్సి ఉంది. సైన్స్ పట్ల కూడా అలాంటి ప్రయత్నమే చేయాలి. అందు వల్లనే సైన్స్ వైపు దృష్టి మళ్ళించాలనే ప్రయత్నాలు పెరిగాయి.

పాతికేళ్ళ పరిణామాలు

మన దేశ సామాజిక గమనంలో 1991 ఒక కొండ గుర్తుగా మారిపోయింది. అంతకు ముందు ఒక స్కూటర్ కావాలంటే నెలల తరబడి వేచి ఉండాలి. ముందుగానే కొంత పైకం చెల్లించి పడిగాపులు కాయాలి. కానీ నేడు అప్పు మీద మీ ఇంటికే కారు, టీవీ తెచ్చి దింపే ధోరణి కనబడుతుంది. లైసెన్సులు లేని సరళీకరణ కారణంగా ఇది సాధ్యమైందని అంటాం. దీని గమనం, గమ్యం టెక్నాలజీయే! సడలించిన నియమాలతో కార్లు, ఏసి మిషన్లు టీవీలు పెరిగిపోయాయి. వీటి ద్వారా మరిన్ని టెక్నాలజీ ఉపకరణాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. సరళీకరణ ద్వారా టీవీ చానళ్ళు వచ్చి మరింత సరళీకరణకు ద్వారాలు తీశాయి. నేడు కంప్యూటర్ అరచేతిలో ఒదిగిపోయే ఆండ్రాయిడ్ ఫోన్‌గా మారిపోయింది. ప్రపంచంలోని ఏ విషయాన్నైనా ఉన్న చోటు నుంచే నెట్ ద్వారా పొందగలుగుతున్నాం. ఏ మూల ఉన్నా మన భాష సినిమాలు నెట్ ద్వారా చూడగలుగుతున్నాం. అదేసమయంలో ...

- ఎక్కువ ఉపకరణాలను వాడిపడేయడంతో ప్రకృతిలో కలిసి పోని కాలుష్యం పరిమాణం తీవ్రత పెరిగిపోయింది. ఉపకరణాలు బాగా పెరగడంతో మానవ శ్రమ మీద గౌరవం తగ్గిపోతోంది. గాడ్జెట్స్ వాడుతున్నాం కానీ అవి

సి.వి.రామన్ బాల్యం ఆంధ్రప్రదేశ్‌లో..

సి.వి.రామన్ 1888లో తిరుచ్చిరాపల్లిలో తిరువనైకావల్ అనే గ్రామంలో మాతామహుల ఇంట జన్మించారు. పార్వతి అమ్మాళ్, చంద్ర శేఖర్ అయ్యర్ తల్లిదండ్రులు. తల్లికి సంగీత ప్రవేశం ఉంది. వీణ చక్కగా వాయించేది. రామన్‌కు మూడేళ్ల వయసులో తండ్రికి విశాఖ పట్నం మిసెస్ ఎ.వి.యన్ కళాశాలలో ఉద్యోగం రావడంతో ఆ కుటుంబం కావేరీ తీరం నుంచి విశాఖ తీరానికి వచ్చింది. 1901లో మద్రాస్ ప్రెసిడెన్సీ కళాశాలలో బీఏ డిగ్రీ చేరే దాకా రామన్ విశాఖపట్నంలో ఉన్నారు. కనుక ఆంధ్రప్రదేశ్‌తో రామన్‌కు అనుబంధం ఉంది. 1907లో ఫైనాన్స్ సర్వీసులో ఉద్యోగం రాగా కలకత్తా వెళ్లి తర్వాత ఇండియన్ అసోసియేషన్ ఫర్ కల్టివేషన్ ఆఫ్ సైన్స్ సంస్థలో పరిశోధన చేశాడు. 1917లో విశ్వవిద్యాలయంలో చేరాడు. 1928లో రామన్ ఎఫెక్ట్ సాధించి 1930 భౌతిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందాడు. కేవలం నలభై రెండేళ్లకే నోబెల్ బహుమతి పొందిన ప్రతిభాశాలి. సి.వి.రామన్ తర్వాత ఏ భారతీయునికి నోబెల్ బహుమతి విజ్ఞాన శాస్త్ర రంగాలలో రాకపోవడం శోచనీయం.

సైన్స్- నాన్ సైన్స్

ప్రతిదీ సైన్స్ అని ప్రచారం చేసుకోవడం ఇటీవల బాగా పెరిగింది. ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీసే సామర్థ్యాన్ని తగ్గించేది సైన్స్ కాదు. సైన్స్‌ను మించిన ఆశావాదం, సమవాదం మరొకటి లేదు. అయితే ఆశ్చర్యకరంగా మతపరమైన నమ్మకాలను సమర్థిస్తూ సైన్స్‌ను విమర్శించడం ఒక ధోరణిగా మారింది. మత సంబంధమైన వ్యక్తులు ఈ రకమైన ప్రచారం పొందుతున్నారు. మరోవైపు రంగురాళ్ళు, న్యూమరాలజీ పేర్లలో అక్షరాలు, యంత్రాలు, రేకులు అంటూ రకరకాల వ్యాపారాలు చేసుకునే వారు పెరిగారు. వారి తోడ్పాటుతో చానళ్ళు అరగంట, గంట వ్యవధి కార్యక్రమాలు ప్రసా రం చేసి లాభాలు గడిస్తున్నాయి. పెళ్ళి కాని యువ త, విద్యార్థుల ఉద్యోగం కోసం ఆశపడే యువతీ యువ కుల బలహీనతలను సొమ్ము చేసుకో వడానికి అటు బాబాలు గానీ ఇటు చానళ్ళు కాని వెంపర్లాడటం, దానికి సైన్స్ అని ప్రచారం చేసు కోడం సిగ్గుచేటు!



నా బీద దేశానికి కనీసం జెండా కూడా లేదే..

"నోబెల్ బహుమతి ప్రకటించినపుడు దాన్ని నా వ్యక్తిగత విజయంగా, నా సహ పరిశోధకుల విజయంగా కాక ఏడు సంవత్సరాల కఠోర పరిశ్రమకు గొప్ప ఆవిష్కరణకు చిహ్నంగా భావించాను. అయితే ఆ బహుమతి అందుకున్నపుడు నిండు సభలో నేనొకడినే భారతీయుడిని! నెత్తిన పాగా, వంటి నిండా కోటుతో పాశ్చాత్యుల మధ్య కూర్చొని వున్నపుడు నేను నా ప్రజలను, నా దేశాన్ని ప్రతిబింబి స్తున్నట్టు అనిపించింది. నేను గుస్తవ్ రాజు నుండి బహుమతి అందుకున్నప్పుడు ఎంతో భావోద్రేకం కల్గింది. ఎంతగానో సంభాళించు కున్నాను. తక్షణమే గుర్తుకు వచ్చింది. నా బీద దేశానికి కనీసం జెండా కూడా లేదని..."

- సి.వి.రామన్

(1930 డిసెంబర్ 11న నోబెల్ బహుమతికి చేసిన స్పందన ప్రసంగంలో...)

సైన్స్- టెక్నాలజీ- ఆరోగ్యం- పర్యావరణం

టెక్నాలజీ పెరిగే కొద్ది మన జీవన శైలిలో మార్పులు భారీ స్థాయిలో వచ్చాయి. ఫలితంగానే వైరల్ రోగాలు రావడం పెరిగింది. ఇది టెక్నాలజీతో మానవాళి ఆరోగ్యంతో ముడిపడిన ప్రధాన విషయం. టెక్నాలజీతో అత్యంత సంబంధమున్న మరో అంశం పర్యావరణం. యంత్రాల నుంచి విడుదలయ్యే కాలుష్యాలు, తయారైన కొత్త రకం ప్లాస్టిక్కులు, పాడయిన కంప్యూటర్లు, మొబైల్ ఫోన్లు వగైరాలు కల్పించే కాలుష్యం ఎంతో ప్రమాదకరమైంది. సైన్స్ కారణంగా తయారైన టెక్నాలజీతో ఏర్పడిన ముప్పు కనుక దానికి సైన్స్ ద్వారానే పరిష్కారం వెదకాలి. ఇటువంటి చోట్లనే సైన్స్ టెక్నాలజీ రంగాలకు మానవీయ శాస్త్రాల ఊతం ఎంతైనా అవసరం.

ఎలా పని చేస్తాయో, వాటి పరిమితులు ఏమిటో గమనించలేకపోతున్నాం.

- సైన్స్ విస్తరిస్తూ మౌఢ్యాన్ని, పిడివాదాన్ని ఎదుర్కొని వాటిని ఓడించింది. కానీ టెక్నాలజీ మాత్రం కొత్త రకం అహంకారాన్నీ, అజ్ఞానాన్నీ పెంపొందిస్తోంది. టెక్నాలజీ వాడుతూ దాన్ని ఉపాధిగా వాడుకుంటూ పూజలు, నమ్మకాలు, జ్యోతిషం, న్యూమరాలజీ వంటి వాటి పట్ల విపరీతమైన వ్యామోహం పెంచుకునే రాతలో అవకాశ వాదం, పలాయన వాదం, ఆత్మవిశ్వాస రాహిత్యం పెరగడం ఆందోళన కలిగిస్తోంది.
- తెలుగు పత్రికలు, టీవీ చానళ్లు, రేడియో చానళ్లు టెక్నాలజీ కారణంగా ఈ పాతికేళ్లలో బాగా విస్తరించాయి. అయితే అదే సమయం సైన్స్ అంశాలు దాదాపు లుప్తమైపోయాయి. పెట్టుబడిదారులకు దోహదపడే టెక్నాలజీ ఆధారిత వాణిజ్యానికి మరింత అవకాశం కల్పిస్తూ, అధో దారినే సైన్స్ విధానంగా పరిగణించమనే రీతిలో ఇవి జారిపోయాయి.
- ధనం కల్గించిన అంతరాల కన్నా టెక్నాలజీ కల్గించే అంతరాలు మరింత బృహత్తరమైనవీ, ప్రమాదకరమైనవీ అని ముందు ముందు మరింత అవగతమవుతుంది.

సమాజానికి వెలుగు చుక్కాని సైన్స్

దీనికి చక్కటి పరిష్కారం సైన్స్ బాట పట్టడమే. ఇదెలా సాధ్యం?

- సైన్స్ విస్తృతి ఏమిటో, టెక్నాలజీ పరిమితులు ఏమిటో తెలుసుకోవాలి. తెలియజెప్పాలి.
- నిత్య జీవితంలో దేనినైనా అనుక్షణం తర్కించాలి, ప్రశ్నించాలి, ఎక్కువ మందికి ఏది ప్రయోజన కరమో దాన్ని స్వీకరించాలి.
- ఇన్ఫర్మేషన్, నాలెడ్జి, విజ్డమ్ ఈ మూడింటిని సరిగ్గా తెలుసుకుని గమ్యం చివరిదని





గమనించాలి.

- రాజకీయ పార్టీల మ్యానిఫెస్టోలో సైన్స్ అంశాలు ప్రధానంగా ఉండాలి.
- మీడియా వినోదానికి, విశ్వాసానికి, వాణిజ్యానికి కాకుండా ఇంగితానికి, హేతువుకు, ప్రజాప్రయోజనానికి పెద్ద పీట వేయాలి.
- టెక్నాలజీని వినియోగించి భారీ ఎత్తున లాభాలు గడించే ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అధిక పన్ను చెల్లించాలి. ఆ పన్ను మౌలిక రంగ పరిశోధనలకు వెచ్చించాలి.
- ఈ విషయాలు, వీటితోపాటు అనుబంధ అంశాలు వ్యాప్తిలోకి రావాలి. ✦

హాబీ



బి.రవి శంకర్ రెడ్డి దగ్గర కాసులు బోలెడున్నాయి. కాసులంటే ఐశ్వర్యం కాదండి నాణేలు, కరెన్సీ నోట్ల కలెక్షన్. వంద రూపాయల బిళ్ల వచ్చిందని వినుంటాం కానీ రవి శంకర్ దగ్గర రూ.20, 60, 75, 125, 150ల కాయిన్లు కూడా ఉన్నాయి. మన దేశానివే కాదు దాదాపు 122 దేశాల కరెన్సీని కలెక్ట్ చేశాడు. కాసులే కాదు సైకిళ్లన్నా కూడా మోజే. వాటిని సేకరించి ఇంట్లో పెట్టేశాడు. కేవలం వీటితోనే రవి శంకర్‌ను పరిచయం చేయలేం. క్రేన్లు వంటి భారీ యంత్రాల వర్కింగ్ మోడల్స్‌పైనే కాదు ఇంటికి మెరుగులు దిద్దే టెక్ సావీ కూడా.

మల్టీ హాబీ స్టార్

విశాఖపట్నానికి చెందిన రవి శంకర్‌ది ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ వృత్తి. సొంతింటికే తన ప్రతిభను వాడుకుని వృత్తిలో ముందంజలో ఉన్నాడు. సెన్సర్లతో పనిచేసే ఆటోమేటిక్ గేట్లు ముఖ ద్వారానికి బిగించిన ఆయన.. ప్రవృత్తుల్లోను మిగతా వారి కంటే ఒక అడుగు ముందున్నాడు. ఒక హాబీ ముందే ఉన్నాడు. సేకరించిన ఒక్కో నాణేనికి ఓ లెక్క ఉంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ (కాగ్)కు 150 ఏళ్లు పూర్తయిన సందర్భంగా 2010లో రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.150 నాణేన్ని విడుదల చేసింది. ఇన్‌కమ్ ట్యాక్ (ఐటీ) డిపార్ట్‌మెంట్‌కు కూడా 150 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా అదే ఏడాది మరో రూ.150 నాణేన్ని విడుదల చేశారు. ఈ రెండిటినీ రవి శంకర్ సేకరించారు. ఐటీకి సంబంధించిన నాణెంపై చాణక్యుని చిత్రముంటుంది. అయితే ఈ మధ్యే ఈ హాబీ అలవడిందనుకుంటే పొరపాటే. ఎప్పుడో చిన్నపుడు స్కూల్‌కు వెళ్లేపుడు నుంచే ఏదో ఒక ప్రత్యేక వస్తువుల్ని సేకరించడం మొదలెట్టాడు రవిశంకర్. అప్పట్లో శీతల పానీయాల కంపెనీలు క్రికెట్‌కు సంబంధించిన ఫ్లికర్ పుస్తకాల్ని సీసా మూతల్ని కలెక్ట్ చేసి ఇచ్చినవారికి బహుమతిచ్చేవి. అలా దిగ్గజ క్రికెటర్ క్లైవ్ లాయిడ్ బ్యాటింగ్ యాక్షన్ ఉన్న ఫ్లికర్ పుస్తకాన్ని సేకరించాడు. ఒకప్పటి ఫేవరెట్ సాఫ్ట్ డ్రింక్ అయిన గోల్డ్ స్పాట్‌కు చెందిన ఫ్లికర్ బుక్ కూడా ఆయన దగ్గర ఉంది. దీన్ని 1980ల్లో కంచర్లపాలెం పారిశ్రామిక వాడలోని కంపెనీ వద్ద నుంచి తెచ్చుకున్నాడు. ఏదో పెద్ద మొత్తంలో ఒకేసారి డబ్బులు వెదజల్లేసి కాయిన్ల సెట్‌ను తెచ్చుకున్న తరహాలో రవిశంకర్ సేకరణ సాగలేదు. ఒక్కో వస్తువును ఎంతో ప్రయాస కోర్చి, ఎన్నో ప్రయత్నాలు, తిప్పలు పడి, ఎన్నో రోజుల పాటు నిరీక్షించి సేకరించాడు. అసలు మజా అంతా అందులో ఉంటుంది. తేలిగ్గా దొరికేస్తే ఇక దాంట్లో ఏం బ్యూటీ ఉంటుంది చెప్పండి. ఇక హాబీ పేరు కూడా వాడక్కర్లేదు. బజార్లో వస్తువుల్ని కొనుక్కున్నట్టు కొనేయొచ్చు. రవిశంకర్ స్టాంప్‌ల్ని కూడా సేకరిస్తాడు. ఇంకా వెరైటీల్ని ప్రయత్నిస్తూ కాయిన్లు, బైస్కిళ్ల వెంట పడ్డాడు. ఎంత శోధించాడంటే తన వద్ద ఆర్బీఐ తొలి గవర్నర్ బి.రామారావు సంతకంతో ఉన్న 1949 జూలైలో విడుదల చేసిన పది రూపాయల నోటు కూడా ఉంది. అలాగే 1975 మేలో విడుదలైన రూ.1000 నోటు కూడా ఉంది. దానిపై తంజావూర్ ఆలయం చిత్రం ఉంటుంది. ఈ నోటు ప్రత్యేకమైంది. అప్పట్లో కొన్ని రోజుల పాటు సర్క్యులేషన్లో ఉన్నా ఆ తర్వాత దాన్ని వెనక్కితీసుకున్నారు. మరో విశేషం ఆర్బీఐకి అతి తక్కువ కాలం అంటే కేవలం మూడే నెలలు గవర్నర్‌గా పనిచేసిన ఎన్.సీ. సేన్ గుప్తా సమయంలో ఇది విడుదలైంది.

ట్రింగ్.. ట్రింగ్..

శ్రమ, సమయం, డబ్బు, మనసు, ఫ్యామిలీ టైమ్ ఇవన్నీ వెచ్చిస్తేనే అరుదైన వస్తువుల్ని సేకరించగలరు. అందుకే కేవలం స్టాంప్‌లకో, నాణేలకో పరిమితమైపోతారు. కానీ రవి శంకర్ అలా అక్కడితో ఆగిపోలేదు. సైకిల్ కలెక్షన్ సవారీ మొదలెట్టేశాడు. అతడి వద్ద ఇద్దరు కూర్చుని నడిపే సైకిల్‌తో పాటు పలు కాలాల్లో తెగ పాపులరైన బైస్కిళ్లు అతి అరుదుగా రోడ్డెక్కిన వింటేజీ ద్విచక్రాలు ఉన్నాయి. అయితే ఈ ట్రింగ్ ట్రింగ్ శబ్దాలు సేకరణతో ఆగిపోలేదు. ఎవరైనా అనుమతి లేకుండా గేట్లు తెరిచేందుకు ప్రయత్నిస్తే అలారమ్ మోగేలా సొంతగా వ్యవస్థను ఇంట్లో ఏర్పాటు చేసుకున్నాడు. సింపుల్‌గా కొన్ని లీవర్లను మార్చి ఆటోమేటిక్ గేట్లను కాస్త మామూలుగా వాడుకునేలా చేసుకోవచ్చు. విద్యుచ్ఛక్తిని వృథా చేయడం ఇష్టం లేకే ఈ ఏర్పాటు. రాత్రుళ్లు మాత్రం భద్రతకు ఈ అలారమ్ సిస్టమ్‌ను ఆన్ చేసి ఉంచుతాడు. మరో మంచి ఆవిష్కరణ ఏంటంటే వాటర్ ట్యాంక్ నిండగానే అలార్మ్ మోగేలా సాంకేతికతను వాడుతున్నాడు. నగరాల్లో చాలా వరకు నీటి వృథా కావడానికి ప్రధాన కారణాల్లో మోటార్‌ను వెంటనే కట్టేయకపోవడం కూడా ఒకటి. సగం ట్యాంకెడు నీళ్లు కిందకు వరదలా వచ్చేంత వరకు మోటార్ వేసి ఉంచారనే విషయమే మర్చిపోతారు చాలామంది. అందుకే నీరే కాకుండా విద్యుత్ వృథా చేయకుండా అలార్మ్‌ను ఏర్పాటు చేశాడు. త్వరలో అతడి ఇంటి గేటు తెరుచుకోడానికి వాయిస్ కంట్రోల్‌ను ఏర్పాటు చేసే ప్రయత్నంలో ఉన్నాడు. ఏ గదిలోకి వెళితే ఆ గదిలో మాత్రమే లైటు వెలిగి గది నుంచి వెళ్లిపోగానే ఆటోమేటిక్‌గా ఆగిపోయేలా సెన్సర్ వ్యవస్థ ఆయనింట్లో మరో ప్రత్యేకత. ఇలా ఇంటికి సాంకేతికంగా మెరుగులు దిద్దడం ఓ రకంగా హాబీనే. అటు వృత్తిలోను బిజీగా ఉన్నా, ఇంటికి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అన్వయిస్తూనే హాబీలకు కూడా సమయం కేటాయిస్తున్నారు. అరుదైన స్టాంపుల్ని, నాణేల్ని ఎలా సేకరించాలనే విషయంతో పాటు టైమ్ మేనేజ్‌మెంట్ పాఠాల్ని కూడా కుదిరితే నేర్చుకోవచ్చేమో.



అరటి పళ్లలో సంతోషాన్ని కలిగించే అమినో యాసిడ్, ట్రిప్టోఫాన్, విటమిన్ బీ6 సహజ రసాయన మిశ్రమం (ఫ్లుహోక్సెటైన్) ఉంటుంది. ఇది శరీరంలో సెరటోనిన్ విడుదలకు సాయపడి కుంగుబాటు నుంచి బయట పడేస్తుంది. మానసిక సమస్యలకు వాడే ప్రొజాక్ మందుల్లో ఉండేది అదే రసాయనం.

ది బనానా క్లబ్ మ్యూజియంలో 17 వేల రకాల అరటి వస్తువుల్ని ప్రదర్శిస్తారు. ఆ మ్యూజియం కాలిఫోర్నియాలోని మెక్కాలో ఉంది.

రెండు అరటి పళ్లు చాలు గంటన్నర పాటు విపరీతమైన కసరత్తు చేసేందుకు సరిపడా శక్తినిచ్చేందుకు. ఇన్‌స్టెంట్‌గా అధిక శక్తినిస్తాయి.

అరటి పళ్లలో దాదాపు 75 శాతం నీరే. అయినా పొడిగా కనిపిస్తుంది.

మనం ఇపుడు చూస్తున్న పసుపు రంగు అరటి పళ్లు నిజానికి జన్యుమార్పిడికి గురైన జాతి. వీటిని 1836లో తొలిసారి గుర్తించారు. అదే రుచిని పెంచింది. అంతకు ముందు తీపే లేకుండా పచ్చగా, ఎర్రగా ఉండేదట ఆ జాతి.

అరటి హాయి.. హాయి



అరటి తొక్క అని తీసిపారేస్తాం కానీ దాన్ని చక్కగా వండుకు తినొచ్చట.

మనలోను అరటి పళ్లలోను యాభై శాతం జన్యువులు ఒకేలా ఉంటాయి.



కనీసం 100 దేశాల్లో అరటిని పెంచుతున్నారు. దాదాపు 300 రకాలున్నాయి. సరిగ్గా చెప్పాలంటే 1000 జాతుల వరకు ఉన్నాయి గానీ అవన్నీ తినగలిగేవి కావు.

అరటి చెట్టు కాదు అదో మూలికా మొక్క. అంటే లిల్లీలు, ఆర్చిడ్లా. అలాగే అది రేగి పళ్లలా బెర్రీ ఫలం.

అరటి పళ్లలో అణు ధార్మిక లక్షణాలుండే పొటాషియం-40 ఐసోటోప్ లుంటాయి. ప్రమాదకర స్థాయిలో కాదులెండి.



1900ల్లో అరటి తొక్క తొక్కి జారిపడి తీవ్రంగా గాయాల పాలయ్యే ఘటనలెక్కువగా ఉండేవి. వీటిని రోడ్డుపై విసరకూడదని అమెరికా చట్టం కూడా ఉండేదట.

పొటాషియం ఎక్కువగా ఉండే అరటి పళ్లు హ్యాంగోవర్ నుంచి బయటపడేస్తాయి.

యాపిల్ పండు రుచి ఉండే గోల్డ్ ఫింగర్ బనానా లున్నాయి. కానీ కావెండిష్ రకమంత ఆదరణ నోచుకోలేదు. ఫిలిఫ్ రోవె హైబ్రిడ్ చేసిన ఈ జాతిని ఆస్ట్రేలియాలోని కొన్ని చోట్ల పండిస్తారు.

ఇప్పుడు విస్తారంగా పెంచుతున్న కావెండిష్ అరటి తోటల్లోని పళ్లని కూడా ఈశాన్య ఆసియాలోని ఓ అరటి చెట్టు పళ్లకు క్లోన్‌లే. ఫంగస్ వంటి ఏదైనా తేడా వస్తే ఒక్క పెట్టున మొత్తానికి మొత్తం తుడిచి పెట్టుకుపోయే అవకాశం ఉంది.



బ్లాక్ మాంబా దళం

ఆఫ్రికాలో కొమ్ములు, దంతం కోసం రోజుకు మూడు ఖడ్గమృగాల్ని, 96 ఏనుగుల్ని అక్రమంగా వేటాడుతున్నారని లెక్కలు. ఇక మిగతా వన్యప్రాణుల సంఖ్య రికార్డు కొడుతుంది. వేటగాళ్ల నెట్‌వర్క్ చాలా విస్తృతమైంది. వాళ్లు ప్రభుత్వాలనే తలకిందులు చేయగల శక్తివంతులు. వారి ఆటల్ని దక్షిణాఫ్రికాలోని గ్రేటర్ క్రూగర్ జాతీయ పార్కులో భాగమైన 'బాలూలే రిజర్వ్'లో చెల్లనీయడం లేదు బ్లాక్ మాంబా దళం. ప్రభుత్వ సహకారంతో 2013లో 26 మంది రేంజర్లతో ఈ స్వచ్ఛంద దళం ప్రారంభమైంది. ఇందులో ఇద్దరు పురుషులు మినహా మిగతా వారంతా మహిళలే. ఈ దళం ఏర్పాటుకు కారణం ఒక్క 2012లోనే ఆ రేంజ్‌లో 1 నల్ల ఖడ్గమృగం, 14 తెల్ల ఖడ్గమృగాల్ని దారుణంగా వేటాడారు. మరో 2 తెల్ల ఖడ్గ మృగాలు తీవ్రంగా దాడికి గురయ్యాయి. ఖడ్గమృగాల అక్రమ వేటకు క్రూగర్ జాతీయ పార్కు కేంద్రంగా ఉండేది. అర కేజీ బరువున్న ఖడ్గ మృగం కొమ్ముకు సుమారు 40 లక్షలు ధర పలకడమే కారణం. ఆ పార్కులో 12 క్రియాశీల వేట జట్లుండేవని అక్కడి ప్రభుత్వమే చెబుతోంది. రిజర్వ్ హెడ్ అయిన క్రైగ్ స్పెన్సర్, ట్రాన్స్‌ఫ్రాంటియర్ ఆఫ్రికాకు చెందిన అమీ క్లార్క్‌లు బ్లాక్ మాంబా దళాన్ని స్థాపించారు. ఈ స్వచ్ఛంద దళానికి ఆయుధాలుండవు. స్థానిక ప్రభుత్వమే అవసరమైన భద్రతను ఏర్పాటు చేస్తుంది. ఆయుధాలు లేకున్నా మిలటరీ దళమంత పటిష్ఠంగా ఉంటుంది. ట్రాకింగ్ నుంచి కంబాటింగ్ వరకు అన్ని విషయాల్లో నిరంతర సాధన చేస్తారు. సవన్నాల భూభాగమైన 400 చ.కి.మీ.ల విస్తీర్ణంలో ఉండే ఆ రిజర్వ్ భద్రతా విషయాల్ని చూస్తారంటే అదీ శక్తివంతులైన వేటగాళ్లను ఎదుర్కొని అనేదాన్ని ఎవరూ నమ్మలేదు. దాదాపు అంతరించాయని ప్రకటించిన బ్లాక్ రైనోల్ని కాపాడటమే వారి ప్రధాన కర్తవ్యం. అత్యాధునిక ఆయుధాలు, నెట్‌వర్క్ ఉన్న స్మగ్లింగ్ ముఠాలతో ఆడోళ్లు పోరాడగలరా? అది మగాడి పని అంటూ తక్కువ చేసిన వారి నోళ్లు మూయించేలా రెండేళ్లలో ఆరుగురు వేటగాళ్లను అరెస్ట్ చేసి వారి స్థావరాల్ని మూసివేయించగలిగారు. బ్లాక్ మాంబాల నిరంతర పర్యవేక్షణతో రిజర్వ్‌లో 76 శాతం ఉచ్చులు, వల పన్నడాలు తగ్గిపోయాయి. వేటగాళ్ల బెడద దాదాపు లేనట్టే. ఓ పది నెలల కాలంలో చుట్టు పక్కల రిజర్వ్‌ల్లో పాతిక వరకు ఖడ్గమృగాలు వేటాడబడితే, బ్లాక్ మాంబాలు కాపు కాస్తున్న రిజర్వ్‌లో ఒక్కటి కూడా చంపబడలేదు. వాటి ప్రాణాలకు తమ ప్రాణాల్ని అడ్డేసి కాచుకుంటున్న బ్లాక్ మాంబాల కృషిని గుర్తిస్తూ ఐక్యరాజ్యసమితి పర్యావరణ వేదిక 'చాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్' అవార్డ్‌తో గౌరవించింది. స్థానికుల మహిళా వివక్షకు పెద్ద చెంప పెట్టులా అయ్యింది. బలూల్యూ రిజర్వ్ హద్దుల వెంట ప్రతిరోజు బ్లాక్ మాంబాలు పెట్రోల్ చేస్తారు. రోజూ 12 మైళ్ల దూరం నడుచుకుంటూ వెళుతూ ఉచ్చులు, జాడలు, వేటగాళ్ల ఉనికేమైనా ఉన్నాయా అని పరిశీలిస్తుంటారు. వీరికి జీతాల సమస్యతోపాటు వారి వాహనాలకు ఇంధనం, కమ్యూనికేషన్ సాధనాలు వంటి అత్యవసరాలతోపాటు విధి నిర్వహణలో తిండికి కూడా ఇబ్బందులు ఎదురవుతున్నా కూడా అంకితభావంతో అడవి తల్లిని భద్రంగా చూసుకుంటున్నారు. 'మేం దృఢమైనవాళ్లం.. బ్లాక్ మాంబాలా కాటు వేస్తామంటూ' వేటగాళ్లను హెచ్చరించే ఈ మహిళ రేంజర్లు మిగతా అటవీ అధికారులకు ధైర్యాన్ని తెస్తున్నారు. వేటగాళ్ల మీద ఓ కన్నేస్తూనే స్థానిక తెగలకు అటవీ పరిరక్షణ గురించి పాఠాలు నేర్పుతున్నారు. ఆఫ్రికా బిగ్ ఫైవ్ అయిన ఏనుగులు, చిరుతలు, సింహాలు, ఖడ్గమృగాలు, అడవి బర్రెలు ఎక్కువగా వేటకు గురవుతుంటాయి. ఖడ్గమృగాల రక్షణ కోసమే ప్రత్యేకంగా పనిచేస్తున్నా మిగతా జంతువుల భద్రతను వీరు మరువరు. మాంసం కోసం వేటాడబడే జంతువుల్నీ కాపాడుతున్నారు. ఆహార ప్రత్యామ్నాయాలపై స్థానిక తెగలకు అవగాహన కల్పిస్తున్నారు. బ్లాక్ మాంబాల్లోని ఓ మేల్ ట్రాకర్ ప్రపంచంలోనే నిశితమైన ట్రాకర్లలలో ఒకరిగా గుర్తింపు పొందాడు. వీరి విజయ గాథలతో స్ఫూర్తి పొంది మరికొందరు స్థానిక మహిళలు, యువత వన్యప్రాణి సంరక్షణకు బ్లాక్ మాంబా యూనిఫామ్ వేసుకుంటున్నారు. ✦

బ్లాక్ మాంబా అత్యంత వేగవంతంగా దాడి చేసే విష సర్పం. చర్మమే కాదు దాని నోరు కూడా నల్లగా ఉండటంతో దానికా పేరు వచ్చింది. వేగంగా దాడి చేయడమే కాదు దాడి చేయగలిగే రేంజ్‌లోను మిగతా పాములు వీటితో పోటీ పడలేవు. అంత చురుగ్గా ఉండే ఈ ప్రమాదకర సర్పాలనే తమ జట్టుకు పేరు పెట్టుకుందో ఆఫ్రికాలోని వన్యప్రాణి వేట నిరోధక దళం. దాని పేరుకు తగ్గట్టే వేటగాళ్ల పనిపట్టడంలో చాలా చురుగ్గా పనిచేస్తోంది. మిగతా రిజర్వుల్లో విరుచుకుపడే వేటగాళ్లు బ్లాక్‌మాంబాలు కనిపెట్టుకుని ఉన్న బాలూలే రిజర్వ్‌లో కాలు పెట్టడానికి కూడా జంకుతారు. ఈ దళం మరో ప్రత్యేకత ఏమంటే... రేంజర్లంతా మహిళలే.



ఆ బడికి గోడలు లేవు. తరగతులు లేవు. కూర్చోడానికి బల్లలు కుర్చీలు లేవు. ఆ బడికొచ్చే చిన్నారులకు మరుగుదొడ్లు కూడా కరవే. అన్నిటినీ మించి ఆ స్కూల్ ఓ రైల్వే బ్రిడ్జి కింద ఉంది. ప్రతీ మూడు నిమిషాలకోసారి దడదడమని శబ్దం చేసుకుంటూ ఓ రైలు వెళ్తుంది. అయితేనేం! ఆ రైలు శబ్దాలేవీ ఫ్లయ్ ఓవర్ కింద శ్రద్ధగా పాఠాలు నేర్చుకునే పిల్లల చెవిని చేరవు. ఇన్ని ప్రత్యేకతలున్న ఈ పాఠశాల మన దేశ రాజధాని నగరంలోనే ఉంది. అక్కడ చదువుకునే పిల్లలంతా డ్రాపవుట్ చిన్నారులే.



బ్రిడ్జి కింద బడి

ఢిల్లీలోని యమునా బ్యాంక్ మెట్రో స్టేషన్ ఫ్లైఓవర్ కింద ఉందీ పాఠశాల. అందరూ 'మాస్టర్ జీ' అని ప్రేమగా పిలిచే రాజేశ్ కుమార్ ఈ స్కూలు ప్రారంభించారు. పేదరికం కారణంగా తన చదువుకు మధ్యలోనే స్వస్తి చెప్పాడు. ఒక చిన్న కిరణా దుకాణం పెట్టుకొని జీవనం సాగించేవాడు. కానీ ఆయన ఆలోచనలు మాత్రం చదువు, బడి చుట్టూనే తిరగాడేవి. తనలా మరెవరూ చదువుకు దూరం కాకుడదని ఆలోచించే వాడు. పిల్లలు ఎవరైతే స్కూల్‌కి వెళ్లడం లేదో– ఎవరైతే ఆర్థిక స్థోమత సరిపోక బడికి పంపడం లేదో వాళ్లందరినీ ఒకచోటకు చేర్చాడు. వాళ్ల తల్లిదండ్రులను కూడా ఒప్పించాడు. ఇంత వరకు బాగానే ఉంది కానీ స్కూలెక్కడ పెట్టాలనేది బేతాళ ప్రశ్నగా మారిపోయింది. అప్పుడే యమునా బ్యాంక్ మెట్రోస్టేషన్ కడుతున్నారు. రైలు శబ్దం తప్ప పెద్దగా గొడవలు లేని ప్రాంతం అది. కాబట్టి ఇదే అనువైన ప్రదేశంగా గుర్తించాడు. చెత్తాచెదారం, ముళ్ల కంపలతో నిండుకొని ఉన్న ఈ ప్రాంతాన్నంతటిని శుభ్రం చేసి స్కూలు మొదలు పెట్టాడు. ప్రారంభంలో ఇద్దరు పిల్లలుండేవారు. మూడు నెలల్లో ఈ అండర్ బ్రిడ్జి స్కూల్ పిల్లలతో కళకళాడింది.

సిలబస్ - ఉపాధ్యాయులు

అన్ని పాఠశాలల్లా ఇక్కడ ఒక సిలబస్ అంటూ ఏమీ ఉండదు. ఎందుకంటే దానికి ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతులు లేవు. ఆ మాటకొస్తే అసలు ఆ స్కూల్ పెట్టిన ఉద్దేశమే వేరు. కాబట్టి వాళ్లకు సిలబస్‌తో పని లేదు. రెండు బ్యాచ్‌లుగా తరగతులు నిర్వహిస్తుంటారు. అది కూడా ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు మాత్రమే. ఇంగ్లీషు, హిందీ, మాథ్స్, సైన్స్‌తో పాటు జాగ్రఫీ, హిస్టరీ వంటి సబ్జెక్టు బోధిస్తారు. అంటే పెద్ద బాల శిక్ష బోధిస్తారని చెప్పవచ్చు. ప్రతి శనివారం స్పోర్ట్స్ క్లాస్ కూడా ఉంటుంది. ఇక్కడ చదువు చెప్పే వారంతా కూడా వాలంటరీగా వచ్చిపనిచేస్తున్నవారే. వారు ఇక్కడ విద్యార్థులతో ఎంతో మమేకమై పాఠాలు బోధించడటమే కాకుండా ఆటలు కూడా ఆడిస్తారు. ఆ స్కూల్‌లో స్వచ్ఛందంగా పనిచేసేవారిలో అన్షుల్ గుప్తా అనే లా స్టూడెంట్, సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్న ఉమర్ ఇమామ్ వంటి వారు ఉన్నారంటే అందుకు కారణం రాజేశ్ కుమార్ ఆశయం అంత ఉన్నతమైంది. వీరే కాకుండా మరో నలుగురు కూడా వచ్చి పాఠాలు చెప్తుంటారు.

వసతులు

కనీస మౌలిక సదుపాయేలేవీ లేకుండానే ఇంతమంది పిల్లలకు పాఠాలు చెప్పడం మాటలు కాదు. వసతుల విషయం పక్కన పెడితే అంతకంటే ముఖ్యమైనది టాయిలెట్ ఇది విద్యార్థులను బాగా ఇబ్బంది పెడుతున్న సమస్య. ఆ విషయంపై స్థానిక ఎంపీని కలిసి విన్నవించాడు. దానితో స్పందించిన ఎంపీ మెట్రో రైల్ అధికారులతో మాట్లాడారు. ఈ స్కూల్ గురించి తెలుసుకున్న రైల్వేఅధికారులు పెద్ద మనుసుతో ముందుకొచ్చారు. టీచర్ నిలబడడానికి ఒక ఫ్లాట్ ఫాం కట్టించారు. గోడలకు నల్ల పెయింట్ వేయించడంతో బ్లాక్ బోర్డులు అందుబాటులోకి వచ్చాయి. మంచి పనిచేస్తుంటే మానవత్వం ఉన్న వారందరు సహకరిస్తారు. రైల్వే అధికారులతో పాటు మరికొందరు రాజేశ్ కుమార్ శ్రేయోభిలాషులు, మిత్రులు పిల్లలకు షూస్, సాక్సులు, పుస్తకాలు, బ్యాగులు వంటివి ఇచ్చారు.

రాజేశ్ కుమార్ కూడా ఇదంతా స్వచ్ఛంద ంగానే చేస్తున్నాడు. కాని కుటుంబాన్ని పోషించా ల్సిన బాధ్యత అతనిపై ఉంది. మధ్యాహ్నం రెండు వరకు స్కూల్ పనులు చూసుకునే ఆయన ఆ తర్వాత కచ్చితంగా తను పెట్టుకున్న కిరాణా షాప్ చూసుకోవాలి. అప్పటిదాకా అక్కడ తన తమ్ముడు వుంటాడు. ఇతను వెళ్ళి అతనికి రిలీవ్ ఇచ్చి రాత్రి పదింటి దాకా షాప్‌లో వుంటాడు. రాజేశ్‌కు ఇద్దరు కొడుకులు.. ఒక కూతురు. పెద్ద కొడుకు ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్నాడు. అతను కూడా స్కూల్‌కు స్వచ్ఛందంగా వచ్చి పాఠాలు చెప్తాడు. అన్నింటి కంటే ముఖ్యంగా భార్య కూడా ఆయనకు ఎంతగానో సహకరిస్తుంది. 'నేను ఎలాగూ చదువుకోలేకపోయాను. కనీసం పిల్లలకైనా చదువు చెప్తున్నాను. జీవితానికి అంతకంటే ఇంకేం కావాలి' అంటాడు. మరి తను నేర్చుకున్న పది అక్షరాలను నలుగురికి పంచినప్పుడే కదా దాన్ని గొప్పతన మేంటో తెలిసేది. మొదట కేవలం ఇద్దరు పిల్లలతో ప్రారంభమైన ఈ బ్రిడ్జి కింద స్కూల్ ఇప్పుడు 200 మందికి పైగా విద్యార్థులతో కళకళలాడుతోంది.

- అనంతోజు మోహన్ కృష్ణ
8897765417

ఓ అమ్మాయికి జనంపై చిరాకెక్కువ. ఒంటరి తనంపై పరాకెక్కువ. ఏకాంతంగా 'ఓ చిన్ని దీవిలో హాయిగా గడిపేస్తే ఎంత బావుణ్ను' అంటూ రోజూ తెగ బాధపడేది. 19 రోజుల పాటు చుట్టూ ఎటు చూసినా సముద్రం తప్ప మరేం కనిపించని, మనిషి జాడే లేని ఓ ద్వీపంలో ఒంటరిగా గడిపేసింది. తర్వాత ఏమైంది?



దీవిలో .. ఒంటరిగా.. 19 రోజులు

జపాన్‌కు చెందిన రీకో హోరీనే ఆ అమ్మాయి. నిండా ఇరవై రెండేళ్లయినా లేని ఈ అమ్మాయికి ప్రపంచంపై, మనుషులపై విపరీతంగా బోర్ కొట్టేసింది. అందరికీ దూరంగా ఎటైనా పారిపోవాలని మనసొకటే గొడవ చేసేదని ఓ టూర్ ఏజెన్సీ ముందు బాధపడింది. 'డూకాస్ట్ అవే' అనే కంపెనీ అంతకు ముందు ఇలాంటోళ్లతో ఓ అడ్వెంచర్ మోడ్‌లో హాలీడేల్ని ఒంటరి సాహసికులకు ఏర్పాట్లు చేసింది. మహా సముద్రాల్లోని ఒంటరి ద్వీపాల్ని వెదికిపట్టి మరీ వాటిల్లో ఆ ఏకాంతులతో తిష్ట వేయిస్తుంది. ఆ తరహా హాలీడేకు తొలి యువతి కాబట్టి హోరీకి అదనపు జాగ్రత్తలు తీసుకోవాలనుకున్నారు నిర్వాహకులు. అదనం పక్కనబెడితే ఉన్న జాగ్రత్తల్లో కొన్నింటికే ఎసరు పెట్టేసిందామె. సీసీ టీవీ సర్వ్యాట్, మఛీటే (గొడ్డలి లాంటిది)తోపాటు లైటర్, లైఫ్‌బోయ్ తదితర అత్యవసర వస్తువుల్ని వద్దంది హోరీ. నేలను పరచుకోడానికి దుప్పటైనా లేకుండా కేవలం ఒక జత దుస్తులతో హాజరైంది.

ఇండోనేషియాలోని అంపారో దీవిలో ఆమె ఒంటరిగా 19 రోజులు గడపాలి. ఆ ద్వీపంలో చిన్న అడవి ఉంది. సముద్ర అలలు పోటు తీవ్రంగా ఉంటుంది. మరో సమస్య ఏమిటంటే ఆ దీవుల ప్రాంతంలో ఎప్పుడెలా వాతావరణం మారుతుందో తెలీదు. ఉన్నట్టుండి భారీ వర్షాలు కురుస్తాయి. అలాంటి చోట... అచ్చు ఆదిమానవుడు ఎలా ఏ పరికరాలు, ఏర్పాట్లు లేకుండా మనగలిగాడో అలా తాను ఆ దీవిలో కలియ తిరుగుతానని పంతం పట్టింది. అడవిలో, దీవుల్లో ఎలా మనగలగాలనే దానిపై శిక్షణనిస్తామంటే అదీ వద్దంది. బలవంతం మీద ఓ భూతద్దం, స్పియర్ గన్, స్నోర్కెల్ కంటద్దాలు, ఓ టార్చిలైట్, జత ట్రౌజర్లు తీసుకుంది. చేసేదేమీ లేక నిర్వాహకులు కనీసం స్మార్ట్ ఫోన్‌తోనైనా తన రోజువారీ పరిస్థితుల్ని డాక్యుమెంట్ చేసుకోమని చెప్పారు. తొలి 24 గంటలు ఆమెతో ఓ బృందం దీవిలో గడిపి ఆమె ఎంతవరకు ఆ పరిస్థితుల్లో నెగ్గుకురాగలదో గమనించింది. ఆ రోజు మంచినీటి జాడ కనపించకపోతే మినరల్ వాటర్ బాటిల్ తీసి ఇచ్చారు. ఆ నీటిని తాగడానికి హోరీ ససేమిరా అంది. నానా తంటాలు పడి ఓ కొబ్బరి బోండాన్ని పట్టుకురాగలిగింది. దాన్ని చాలాసేపు వట్టి రాళ్లతో పాట్లు పడి చివరకు నలగ్గొట్టి రంధ్రం చేయగలిగింది. ఇంట్లో తిరిగినట్టే చెప్పులు లేకుండా ఒట్టికాళ్లతోనే దీవిలో, అడవిలో తిరిగింది. ఏవైనా జంతువులో, కీటకాలో వస్తాయనే స్పృహే లేకుండా ఆ రాత్రి వట్టి నేలపై పరుండిపోయింది. ఇదంతా చూశాక ఆమె ఈ 19 రోజుల్లో ఎన్ని గాయాలు చేసుకుంటుందో, ఎన్ని ప్రమాదాల్లోకి వెళుతుందోనని ఓ ఒప్పందం చేసుకుంది బృందం. అత్యవసర పరిస్థితి ఎదురైతే కచ్చితంగా తెలపాల్సిందేనని నిర్వాహకులు షరతు పెట్టారు. దీవికి వెళ్లగలిగే ఒకే ఒక మార్గం ముఖద్వారాన ఓ సెక్యూరిటీ గార్డునుంచారు. అక్కడి నుంచి దీవికి చేరుకోవాలంటే 40 నిమిషాల సమయం పడుతుంది. బృందం దీవిలో వదిలిపెట్టి వెళ్లిపోగానే అనిపించిన హాయి రెండో రోజుకే ఎగిరిపోయిందని హోరీ ఆ తర్వాత చెప్పింది. దీవిలోనే కాదు మొత్తం సముద్రంలోనే ఒంటరిగా ఉందనే భయం పెరిగిపోయింది. మరో 18 రోజులు ఎలా గడుస్తాయా అని ఆ రోజు నుంచే అనిపించేసింది.

ఇంతలో ఒకటే భారీ వర్షం.. ఉరుములు, మెరుపులతో కూడిన దాని ధాటికి దీవితోపాటు హోరీ గడగడలాడిపోయింది. తిండికి, నీటికి చాలా పాట్లు పడింది. వర్షానికి బాగా నానిపోవడంతో జ్వరం పట్టుకుంది. కడుపులో ఏంలేక తల తిరగడం మొదలైంది. అయితే ఐదో రోజు కల్లా అక్కడి పరిస్థితులకు తట్టుకుని మనగలగడం ఆమెకు అలవాటైంది. చిన్న చిన్న చెట్లనెక్కి కొబ్బరి బోండాల్ని తెంపడం, తెలివిగా తేల్గ్గా పగలగొట్టగలడం, వాటి పీచును ఎండబెట్టి భూతద్దం సాయంతో మంట వేసుకోవడం వంటివి వచ్చేశాయి. స్పియర్ గన్‌తో చేపల్ని పట్టడం నేర్చుకుంది. ఏడో రోజు ఓ పెద్ద తొండ కనిపించింది. దాన్ని పట్టుకుని వండుకు తిందామంటే అది దొరికినట్టే దొరికి తప్పించుకుంది. చివరి రోజు ఆ అవకాశం చిక్కింది. మరో పెద్ద తొండను తెలివిగా ట్రాప్ చేసి మంటలో కాల్చుకుని హాయిగా విందు చేసుకుంది హోరీ. కొన్ని రోజుల్లోనే అక్కడి నుంచి బయటపడిపోదామని అనుకున్న హోరీనే 19వ రోజు వరకు దీవిలో ఒంటరిగా ఉండగలిగి నిర్వాహకుల్ని ఆశ్చర్యపరిచింది.

ఒంటరి అనుభూతులు...

మనుషుల్లేని ప్రపంచం ఓ ప్రపంచం కాదని తెలుసుకున్నానని.. దీవి నుంచి వచ్చాక ఇంటర్వ్యూలో చెప్పింది. చాలా ఒంటరితనానికి లోనయ్యానని, ఇలా ఎవరూ లేకుండా ఉండెందుకని కూడా అనిపించేదని తన అనుభూతుల్ని వివరించింది. ఎంత త్వరగా సాటి మనుషుల్ని చూస్తే అంత బావుణ్ను అనిపించేదట. మనిషి మాటకు, పలకరింపుకు మొహమాచిపోయిందట. అసలు ఎవరూ అక్కర్లేదు అనుకునేదాన్నని, ఇప్పుడు చుట్టూ మన అంటూ ఒకరుంటేనే ఆనందమని గ్రహించానని బుద్ధిగా చెప్పింది. కానీ, ఆమె అనుభవాల్లో గొప్పగా తోచిందొకటుంది. ఒసాకాకు చెందిన హోరీకి నిండు చంద్రుడిని చూసే అవకాశం ఆ ఊరి కాలుష్యం వల్ల అప్పటి వరకు కలగలేదు. కానీ ఆ దీవిలో ఉన్నప్పుడు ఓ పున్నమి రోజు రావడంతో నిండు వెన్నెల విరగ్గాయడమంటే ఏంటో, అది ఎంత అద్భుతంగా ఉంటుందో అనుభూతి చెందింది. అన్నట్టు ... తన 22వ పుట్టినరోజును కూడా ఆ దీవిలోనే ఒంటరిగా సెలబ్రేట్ చేసుకుంది.

82,951 చిత్రాలు.. 5775 మంది ఫొటోగ్రాఫర్లు.. 128 దేశాలు.. ఇదీ వరల్డ్ ప్రెస్ అవార్డులకు నామినేషన్లు అందిన లెక్క. ఒక్కో చిత్రం ఒక్కో సన్నివేశాన్ని, ఒక్కో పోరాటాన్ని, ఒక్కో అస్థిత్వాన్ని, ఒక్కో అంతర్యోశాన్ని, ఒక్కో యదార్థాన్ని లోతుగా, నిశితంగా, తీక్షణంగా ప్రకటించాయి. వీటిలో ఓ బ్లాక్ అండ్ వైట్ అదీ బ్లర్ అయిన ఫొటోకు అవార్డ్ దక్కింది. మొత్తం సిరియా శరణార్థుల సంక్షుభిత జీవితంలోని ఇరు పార్శ్వాల్నీ విడిగా అతి పదునుగా కాంట్రాస్ట్ చేసిన చిత్రమది. పబ్లిషింగ్‌కు కూడా నోచుకోని ఈ చిత్రాన్ని అంతగా పైస్థాయిల్లో పేరు వినిపించని ఫ్రీల్యాన్స్ ఫొటోగ్రాఫర్ వారెన్ రిచర్డ్‌సన్ తీశారు.

వారెన్

'కంచె' చిత్రం కత

ఆస్ట్రేలియాకు చెందిన వారెన్ రిచర్డ్‌సన్ ఫ్రీల్యాన్స్ ఫొటోగ్రాఫర్‌గా నెలల తరబడి శరణార్థుల వెంట నడుస్తూ వారి జీవన్మరణ పోరాటాన్ని చిత్రీకరిస్తున్నాడు. వివరించ సాధ్యం కాని ఆ వేదనామయ జీవితాల్ని ప్రపంచం కంటికి ప్రొజెక్ట్ చేసేందుకు కెమెరా లెన్స్‌ల్ని సరిచేసుకుంటున్నాడు. అప్పటికే కళ్లెదుట నుంచి 20 వేల మంది శరణార్థి బతుకులు వలస పోవడాన్ని చిత్రాల్లో బంధించాడు. వాటిలో ఓ శరణార్థి గుంపుతో దగ్గరయ్యాడు. హోర్గెస్ (సెర్బియా) – రోస్జ్కే (హంగేరీ) సరిహద్దు మీదుగా కంచె దాటాలనేది వారి సవాలు. జర్మనీ చేరుకోవాలనేదా సాహసం. 2015 ఆగస్ట్ 27 పున్నమి రోజు. ఆ అర్ధరాత్రి వారికి చాలా కీలకమైన సమయం. నిండు చంద్రుడి వెలుగులో ఎలాగన్నా కంచె దాటేయాలి. పోలీసుల కంటబడకుండా ఇనుప కంచె దగ్గరలోని యాపిల్ చెట్ల కింద జాగ్రత్తగా దాక్కున్నారు. ఆ గుంపులో కొందరు ఇంజనీర్లున్నారు. పోస్ట్‌కు పోస్ట్‌కు మధ్య పాట్రోల్ చేస్తున్న భద్రతా సిబ్బంది కళ్లుగప్పి కంచె దిగువ నుంచి దారి చేసి గుంపును తప్పించడమే వారి ప్లాన్. గుర్తులు ఏ మాత్రం తెలియకుండా కంచె యథాతథంగా ఉన్నట్టు సెట్టింగ్ చేస్తున్నారు. చివరి అడ్డు తొలగింది.. ఇంతలో భద్రతా సిబ్బంది వచ్చేశారు. చెట్ల కింద నక్కిన శరణార్థుల గుంపు ఊపిరి బిగబట్టి నిశ్శబ్దంగా ఉన్నా.. దాని రెండొందల గుండెల ఉద్వేగాల చప్పుడు మాత్రం ఎగదన్నుకు వినిపిస్తోంది. పాట్రోల్ పోలీసులు స్పాట్‌కు చేరుకున్నారు. కంచెను పరిశీలించారు. ఏదో అనుమానంగా ఉంది. విజిళ్లు వేశారు. అరుపుల్తో హెచ్చరించారు. భారీగా పెప్పర్ స్ప్రే జల్లి వెళ్లిపోయారు. ఒక్కసారిగా గుంపంతా ఊపిరి సలిపే సరికి ఆ అంధకారమే వణికినట్టయి వారెన్ రిచర్డ్‌సన్ వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. మొత్తం ఐదు గంటల్లో విడతల వారీగా గుంపంతటినీ ఇంజనీర్లు కంచె దాటించి వారెన్‌కు తుది వీడ్కోలు పలికారు. ఈ దృశ్యాలన్నింటినీ వారెన్ చిత్రీకరిస్తూనే ఉన్నాడు. ఎక్కడ నిశ్శబ్దాన్ని ఛేదించి ఉనికి చెప్పేస్తుందేమోనని క్లిక్‌మనే కెమెరా శబ్దాన్నే వారెన్ భరించలేకపోయాడు. ఫ్లాష్ వాడితే ఆచూకీ తెలిసిపోతుందేమోనని దాన్ని పక్కనబెట్టేశాడు. అన్ని జీవితాల్ని సంక్షోభంలో పడేయలేక అలికిడి లేకుండా చిత్రాల్ని తీశాడు. గుంపు మజిలీ మొక్కజొన్న తోటల గుండా పాత రైల్వే ట్రాక్ పక్కగా మళ్లిపోయింది. శరణార్థులతో కలసి కాలినడకన నెలలపాటు సెర్బియా నుంచి నార్వే వరకు కొనసాగిన వారెన్.. వేలాది మంది జీవితాల్ని ప్రశ్నార్థకంలోకి నెట్టిన వందల సన్నివేశాల్ని కళ్లారా చూశాడు. తానే ఓ శరణార్థిగా పోరాడాడు. ఓ బోర్డర్ వద్ద పోలీసు దాడుల్లో తీవ్రంగా గాయాలపాలయ్యాడు.

డెవలపైందిలా..

ప్రాజెక్ట్ పూర్తయి చిత్రాల్ని మీడియా ఏజెన్సీలకు అందించేందుకు ఇంటికి చేరుకున్నాడు. కొన్నిరోజుల పాటే కుటుంబంతో గడిపే వృత్తి కావడంతో, ఆ సమయం తగ్గిపోకుండా.. ఇంట్లోవాళ్లను ఇబ్బంది పెట్టకుండా రాత్రుళ్లు చిత్రాలను డెవలప్ చేసుకుంటాడు వారెన్. అలా ఓ రోజు రాత్రి పనిచేస్తుండగా చీకటిని చీల్చుకుంటూ ఓ చిత్రంలో కంచె మెరిసింది. అంతా బ్లాక్ అయ్యిందొచ్చనుకున్న హోర్గెస్–రోస్జ్కే కంచె దాటే సన్నివేశాలకి చెందినదా చిత్రం. ఇనుప ముళ్ల కంచెకు అటువైపున్న ఓ వ్యక్తి.. పసిబిడ్డను ఫెన్స్ కింద నుంచి మరో వ్యక్తి చేతికి అందించబోతున్న సన్నివేశం అందులో ప్రత్యక్షమైంది. చిత్రంలో ఆ వ్యక్తి ఆందోళన, భయం, ఉద్విగ్నత జాడలున్నాయి. అతడి లోలోపలెక్కడో ఇంకా ఆశగా మిణుకుమిణుకమంటున్న ప్రాణం వణికినట్టు ఇమేజ్ కాస్త బ్లర్ అయ్యింది. ఇటువైపు బిడ్డ వచ్చేస్తే ఏదో భరోసా అన్నట్టు బ్యాక్‌గ్రౌండ్. ఏదో ఆశను కల్పిస్తూ కార్నర్‌లో చాచిన రెండు చేతులు. క్షణక్షణ పోరాటంలో అలసిసొలసిన బిడ్డ.. ఆ ప్రయత్నం పట్టకుండా నిద్రపోతున్న తీరు. చిత్రమంతటిలో షార్ప్‌గా కనిపిస్తున్న బలమైన సింబాలిజమ్ ఇనుప కంచె. ఇదంతా ఆ పున్నమినాటి చంద్రుడి వెలుగులో తెల్లవారు 3 గంటల సమయంలో మసకమసగ్గా కెమెరా పట్టుకోగలిగింది. ఏదో తెలీని ఆకర్షణ ఆ చిత్రంలో కనిపించింది. దాన్ని మీడియా ఏజెన్సీలకు పంపాడు. బ్లరైందని ప్రచురించలేదో, లేక సిరియా విషయమే బ్లర్ అయిపోయిందో తెలీదు. ఇంతలో వరల్డ్ ప్రెస్ ఫొటో జర్నలిజమ్ (2015) సంబంధించి అవార్డులకు నామినేషన్స్‌ను పంపాల్సిందిగా ప్రకటన వెలువడింది. వారెన్ మిత్రడైన ఓ ఫొటో ఎడిటర్‌కు వెంటనే ఈ చిత్రం గుర్తొచ్చింది. మొత్తం సిరియా శరణార్థుల సవాళ్లను, పోరాటాలను ఒక్క ఫ్రేమ్‌లో చూపే అవకాశమున్న చిత్రాల్లో ఇదొకటని మిత్రుడి వాదనతో 'హోప్ ఫర్ న్యూ లైఫ్' టైటిల్‌తో సబ్‌మిట్ చేశారు. ఏజెన్స్ ఫ్రాన్స్ ప్రెస్సె ఫొటో డైరెక్టర్ ఫ్రాన్సిస్ కోహ్నా సారథిగా 18 మంది జ్యూరీ సభ్యుల కమిటీ వారెన్ చిత్రాన్ని సత్కారానికి ఎంపిక చేసింది.

- జే

వింత లోకం



టబ్ సరిపోతుందా?

డేనియల్ డాల్స్‌ది న్యూజిల్యాండ్. కానీ ఇప్పుడు మియామీకి వచ్చి ఓ చిన్న బాత్ టబ్‌లోనే రోజులు గడుపుతోంది. తన రెండేళ్ల కొడుకు, కుటుంబం, ఇల్లు, ఊర్ని విడిచిపెట్టి నెల రోజుల పాటు ఆ చిన్న టబ్‌లో ఇరుక్కుని గడిపేస్తోంది. ఆమెను ఎందుకమ్మా ఇదంతా చక్కగా ఇంటికి వెళ్లిపోరాదు హాయిగా, స్వేచ్ఛగా బతికేయరాదంటే మరి ఇదే మాట ఓర్కా (కిల్లర్ తిమింగలం) విషయంలో ఎందుకు అనడం లేదని నిలదీస్తోంది. మియామీలోని సీక్వేరియంలో 22 అడుగులుండే లోలితా అనే భారీ తిమింగలాన్ని కేవలం 60x80x20 ఘనపు అడుగుల పెన్ (నీటి ట్యాంక్‌లో)లో బంధించింది యాజమాన్యం. రోజుకు వంద మైళ్లు ఈదితేనే గానీ 3200 కేజీల ఈ జీవికి స్వేచ్ఛగా అనిపించదు. అలాంటి తిమింగలానికి ఆ పెన్ చిన్న టబ్‌లాంటిదే. 1970 నుంచి ఇలా ఆక్వేరియంలో ఒంటరిగా ఉంటున్న ఆ భారీ జీవి ఎంత వేదనను అనుభవిస్తుందో తెలియజెప్పేందుకే డేనియల్ ఇలా వినూత్న తరహాలో నిరసన వ్యక్తం చేస్తోంది.

ఒక్కడి కోసం తరగతంతా..

బోస్నియా రాజధాని అయిన సర్‌యేవో నగరానికి చెందిన మీర్జానా కొరాలిక్ తన ఆరేళ్ల కొడుకు జెజ్డ్‌ను దగ్గరలో ఉన్న ఓస్మాన్ నకాస్ ప్రాథమిక పాఠశాలలో వేసింది. కానీ అతడు బధిరుడు కావడంతో తరగతిలో ఒంటరిగా కూర్చునేవాడు. మిగతా పిల్లలు మాటలకు స్పందించకపోవడంతో ఫ్రెండ్స్ కాలేకపోయారు. ఈ విషయాన్ని అధ్యాపకురాలు సనేలా ల్యూమనోవిక్ తొలిరోజే గమనించింది. తేలికగా మిగతా పిల్లలకు అర్థమయ్యే కొన్ని సైగల్ని నేర్పించింది. ఈ విషయం తెలుసుకున్న ఓ విద్యార్థి పేరెంట్ మరో ఆలోచన చేశారు. ఏకంగా జెజ్డ్ సహ విద్యార్థులంతా సైగల భాషను నేర్చుకుని ఆ పిల్లాడితో కలసిమెలసి ఉండటానికి అనీసా సెట్కిక్ సెన్డిక్ అనే టీచర్ సేవల్ని ఏర్పాటు చేశారు. మూడు నెలలు గడిచేసరికి తరగతి పిల్లలందరూ సైగల భాషను నేర్చేసుకుని జెజ్డ్‌తో కలసి హోమ్‌వర్క్, గేమ్స్ వగైరా చేసేస్తూ జెజ్డ్‌కు తనలోని లోపాన్ని తెలీకుండా చేస్తున్నారు. ఈ ఆదర్శ తరగతి గురించి తెలిసి మిగతా తరగతుల పిల్లలూ ఆ భాషను నేర్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ఒక్క విద్యార్థి కోసం తరగతంతా ఇలా చేయడం గొప్ప విషయం.



భార్యకు ప్రేమతో..

జపాన్ షింటోమీ టౌన్‌లో మియాజాకీ గృహం ఫ్లాక్స్ మోస్ పూల వనంతో కప్పేసి ఉంటుంది. ఏటా మార్చి, ఏప్రిల్ నెలల్లో ఆ గులాబీ రంగు పూలు విరబూసి సుగంధాలను వెదజల్లుతుంటాయి. రోజుకు ఏడు వేలకు పైగానే సందర్శకులు ఈ అద్భుత నందనవనాన్ని చూసేందుకు తూనీగల్లా వాలిపోతారు. పూలతో పాటు ఓ జంటనూ చూసి ముచ్చటపడతారు. వారే కురోకి దంపతులు. 1956లో వివాహం చేసుకున్న ఆ జంట షింటోమీలో ఓ స్థలం కొని ఇల్లు, చావిడి ఏర్పాటు చేసుకున్నారు. 60 వరకు ఆవుల్ని పెంచి పాల వ్యాపారం చేసేవారు. కురోమీకి భార్యను జపానంతా తిప్పి చూపించాలని కోరిక. కానీ యాభై ఏళ్లు నిండేనాటికి భార్యకు కంటిలో సమస్య వచ్చింది. వారానికే అంధురాల్ని చేసేసింది. ఎప్పుడూ నవ్వుతూ కనిపించే భార్య మోములో ఎక్కడా లేని విషాదం అలముకోవడం, ఆమె ఒంటరిగా గదిలోనే గడిపేస్తుండటంతో కురోమీ తట్టుకోలేకపోయాడు. ఓ రోజు భార్య పింక్ పూల వాసన చూస్తూ కాస్త నవ్వింది. అదే ప్రేరణగా కురోమీ ఓ పెద్ద ఆలోచన చేశాడు. తమ స్థలమంతా ఆ పూల వనంగా మార్చేస్తే ఆ పరిమళం భార్యకు సంతోషాన్నిస్తుందని, పూదోటను చూసేందుకు దేశంలోని నలుమూలల నుంచి సందర్శకులు వస్తారని అలాగైనా జపాన్‌ను సందర్శించినట్టేనని పూలవనం చేశాడు.

మాంసం పెంపకం

ఆహారం కోసం జీవుల్ని వధించకుండా మాంసాన్ని బయోరియాక్టర్ ట్యాంకుల్లో ఉత్పత్తి చేసుకునేలా ఓ ఆలోచన శాస్త్రలోకంలో ఉంది. దీన్నే మెంఫిస్ మీట్స్ ఆచరించేస్తోంది. ల్యాబ్‌లో పెంచిన మాంసంతో ఓ మీట్ బాల్‌ను కూడా వండి వార్చేసింది. ఇరవై రోజుల క్రితమే ఈ కంపెనీ మొదలైంది. రానున్న మూడు నాలుగేళ్లలో పెద్ద మొత్తంలో ఉత్పత్తి చేసే సాంకేతికతను అభివృద్ధి చేసుకుంటామని ఆ సంస్థ చెబుతోంది. పునరుత్పత్తి కాగల కణాల్ని సేకరించి వాటికి కావాల్సిన పోషకాల్ని అందిస్తూ పెంచే ఈ పద్ధతిలో జీవ కారుణ్యమే కాదు పర్యావరణానికి గొప్ప మేలు జరుగుతుంది. రానున్న కాలంలో ఆహార సంక్షోభాన్ని నివారిస్తుందని అంచనా. తక్కువ ధరకే అందించేలా ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పుడు ఒక కేలరీ మాంసానికి 23 కేలరీల దాణా ఖర్చుచేస్తుంటే కొత్త విధానంలో కేవలం 3 కేలరీలే అవసరం. 90 శాతం గ్రీన్ హౌజ్ వాయువుల ఉత్పత్తిని అరికట్టొచ్చు. యాంటీ బయోటిక్స్, పారాసైట్లు వంటి ముప్పుండదని సంస్థ చెబుతోంది. గూగుల్ సహవ్యవస్థాపకుడు సెర్గీ బ్రిన్ కూడా ఈ పద్ధతిపై ఆసక్తి చూపిస్తున్నాడు.

అ-స-హ-నం



లక్కరాజు శ్రీనివాసరావు
సెల్: 9849166951

యుగాలు మారినా
తరాలు మారినా
దేశాలు మారినా
జాతులు అంతరించినా
కొత్త సిద్ధాంతాలు అవతరించినా
ఇజాలు మారనిది
అడుగడుగున కన్పించేది
ప్రతి నిమిషము ప్రతిబింబించేది
అది నాల్గక్షరాల సముచ్చయం
ప్రకృతి మనిషిపై
మనిషి ప్రకృతిపై
క్షణక్షణం దాడిచేసుకొంటూ
విలయాన్ని విధ్వంస రచనకు
సిరానందించే అక్షరాలవి

◆◆◆

చినుకురాల్చక రైతన్నపై
మెతుకు విదల్చక పేదవాడిపై
కడుపు మండిన కూలిపై
జీతపురాళ్ళందని కార్మికుడిపై
వరదలుగానో, భూకంపాలు గానో
అగ్ని పర్వతాలు గానో, ఆకలిగానో
ప్రతి నిమిష నిమిషము ప్రజ్వరిల్లే
అక్షరాలవి..

◆◆◆

ఇక నిత్య జీవితంతో ముడి వేసుకొనే
అక్షర మాల యిది
పొద్దు పొద్దునే పేపర్ బాయ్ రాకపోతే
రీడర్‌కి
తెల్లారేసరికి పాల ప్యాకెట్ రాకుంటే
ఇల్లాలికి
తాగే కాఫీలో పంచదార చాలకుంటే
మగడికి
తొడుక్కొనే షూస్ కనబడకపోతే
కొడుక్కి
టైమ్‌కి ఆఫీసులోకి అడుగిడకపోతే
అధికారికి
కూరగాయలు మార్కెట్టులో
'క్రూర' గాయాలుగా మారినప్పుడు
వినియోగదారుడికి
పరీక్ష మార్కులు (ర్యాంకు) రాకపోతే
అమ్మానాన్నలకి
మంచి అల్లుడు రాకపోతే
అమ్మకి
తడిసి మోపెడైన కరెంటు బిల్లు వస్తే
నాన్నకి
మెచ్చిన హీరో సినిమాకో టికెట్
అందకుంటే
అభిమానికి
టికెట్‌పై అధిక రేటు మోపితే
ప్రయాణికుడికి
అవినీతితో కార్యాలయాలు
మునిగిపోతే
అవసరార్థికి
ట్రక్కులు ట్రక్కులు ఇసుక తోడితే
డ్యాములకు
ఇష్టమొచ్చినట్లు చెట్లు నరికితే
ప్రకృతికి
అంగడిలో సరుకు కల్తీ చేసి ఎక్కువ
డబ్బు అడిగితే
వినియోగదారుడికి
ఋణాలు మాఫీ అంటూ అబద్ధాలు
చెపితే
ఓటర్లకి
పదవికి ఎసరు వస్తే
మంత్రి గారికి
లౌకికమంటూ మతాన్ని వెనకేసుకొస్తే
సంప్రదాయవాదులకు
అవార్డులొద్దని అవార్డ్ సొమ్ము
దిగమింగిన వారిని
చూసి నిర్వాహకులకు
బ్లండర్ మిస్టేక్ చేసి తప్పు
అవతలవాడిదన్నప్పుడు
సమర్థుడికి
తాము వద్దన్నది తిన్నారేమోనన్న
అనుమానం వచ్చినప్పుడు
అసమర్థుడికి
మదిలో మెలిగే అక్షరాలే
"అ-స-హ-నం"

◆ కథ

అంతిమం

- మానస ఎండ్లూరి

రాధమ్మ చెంప ఛెళ్ళుమంది!

కింద పడిన ఆమె పైకి లేచి సర్దుకుని ఆరేళ్ళ కూతురి గొంతుకి కత్తి పెట్టింది!!

"ఇదిగో ఇయ్యాల్తో నీ ఆటలు కట్టిపెట్టు! యాతనైపోయింది నీతో! అటో ఇటో తేలిపోవాలి నీ సంగతి సెప్తున్నా!

నా కాడ డబ్బుల్లేవు నీతో యాగలేను, దీన్ని సంపేసి నానూ సత్తాను! పని సేసి నాలుగు డబ్బులు యనకేసుకొద్దావని లేదూ?

పిల్లని బళ్ళో సేర్పియ్యాల. నీ డబ్బులూ నీ తాగుడుకే తగలెడతావు. తాగుబోతు సచ్చినోడా నీ జిమ్మడ!" భర్త సత్తిబాబుని మాటల్తోనే ఉతికి పారేసింది రాధమ్మ.

"ఏటే? ఏటీ? ఇయ్యాల రొండో తేదీ! డబ్బులొత్తాయని నాకు తెల్దనుకున్నావా? ముండ కానా! ఇత్తావా సత్తావా? నిన్ను సంపేసినా పాపం లేదే ఎదవ కానా! తియ్యే డబ్బుల్తీ!" తూగిపోతూ అన్నాడు సత్తిబాబు.

అసలే తాగున్నాడు. అన్నంత పని చేయకపోయినా భార్యని చావబాదుతాడు. రాత్రంతా భార్యను కొట్టి పొద్దుటికి కాళ్ళు పట్టుకుంటాడు. పగలంతా చాలా మంచిగా ఉంటాడు. సాయంత్రానికి మళ్ళీ మామూలే!

వృద్ధురాలైన తల్లంటే ప్రాణాలిచ్చేంత ప్రేమ! ఈ వయసులో కూడా ఆమె కొడుకు సత్తికి అన్నం తినిపిస్తుంటుంది!

అలాగే కూతురంటే కూడా ప్రాణం. ఆ పిల్లని బళ్ళో చేర్పించాలని అతనికీ ఉంది కానీ, తాగుడికి బానిస కావడం వల్ల డబ్బులు తగలేస్తున్నాడు. అయితే, పెళ్ళాం దగ్గర అజమాయిషీ చెయ్యడానికి ముందే తాగి వస్తాడు! అతడి కూతురు చిన్నది. ఏమీ అర్థం చేస్కో లేని వయసు! నాన్న ఎందుకు పగలంతా ప్రేమగా ఉంటాడో..? సాయంత్రం అయ్యేసరికి అమ్మనెందుకు కొడతాడో తెలీదు! రాధమ్మ ఆరిళ్ళలో రోజంతా పని చేస్తూనే ఉంటుంది. కానీ ఆ డబ్బంతా సత్తి బాబే దోచేస్తాడు. కూతుర్ని స్కూల్ యూనిఫాంలో చూడాలనీ, తమ బతుకులు మారాలనీ రాధమ్మ ఎన్నో కలలు కంటోంది. సత్తిబాబు సరిగ్గా ఉంటే అన్నీ బానే ఉండేవి!

"ఆ దొరికాయి పోయే! నువ్వేటి ఇచ్చేది గోంగూర కట్ట!"

రాధమ్మ బొడ్లో దోపుకున్న డబ్బులు చటుక్కున తీస్కోని పారిపోయాడు సత్తిబాబు.

ఇక రాధమ్మ ఏడవడం, కూతురు తల్లి కళ్ళు తుడవడం షరా మామూలే!

◆◆◆

రాత్రి పది దాటుతోంది సత్తిబాబు, అతడి స్నేహితులు నలుగురు తప్ప తాగి సారాయి అంగడి ముందు మట్టిలో దొర్లుతున్నారు. ఒకరితో ఒకరు సంబంధం లేకుండా ఏవేవో మాట్లాడుకుంటున్నారు. అంగడి మూసేస్తూ 'ఎవరి దారిన వాళ్ళు పోండ్రా!' అని అరిచాడు యజమాని. రోజు ఆ కూత విననిదే సత్తిబాబుకి, అతడి స్నేహితులకి వెళ్ళాలని తోచదు. మెల్లగా ఒకరిని పట్టుకుని ఒకరు పడుతూ లేస్తూ నిలబడ్డారు. అక్కడికి సగం పనైంది! ఇక కిలోమీటరు దూరంలో ఉన్న ఇళ్లకి చేరుకోవాలి. ఇది వారికి అలవాటైన పనే! రెండో తారీఖు కదా! ఒకటో తేదీ వచ్చిన జీతమంతా పీకల్లోతు తాగేశారు. తప్ప తాగిన తప్పటడుగులు అసౌకర్యాన్ని కలిగిస్తున్నాయి. బాగా చీకటి పడింది. దాదాపు ఎవరూ లేరు రోడ్డు మీద. అంతా నిర్మానుష్యం, నిశ్శబ్దం.

"ఒరే సత్తిగా ఎదర సూడ్రా! ఏదో వత్తుంద్రా...తెల్లగా!!" తాగిన మైకంలో ఎదురుగా ఉన్న దాన్ని గుర్తుపట్టలేక అన్నాడు ఒకడు.

"ఎల్లెహే! ఏటీ లేదు! పిరికి నాయాలా!"

"అవున్రా ఎవరో మనిషిరోయ్!"

"ఆ! మనిసి కాదు రా! ఆడ మనిసి!!" కన్ను కొడుతూ అన్నాడు సత్తిబాబు.

"ఇంత రేత్రి కాడ ఆడమనిషి రోడ్డు మీద ఎందుకుంటుంది రా.. సోది నా కొడకా!"

"రేయ్! ఎందుకుందో అడుగుదాం పదండ్రా!" అన్నాడు సత్తిబాబు.

ఒకరి భుజాల మీద ఒకరు చేతులేసుకుని ఐదుగురూ ముందుకి నడిచారు.

"ఒరేయ్! పక్కనే తుప్పల్లోకి తీస్కెళ్ళి పని కానిచ్చేద్దాం!" ఎవడో అన్నాడు. సత్తిబాబుకి ఆ ఆలోచన మనసులో నాటుకుంది.

"అయినా ఇంత రేత్రి కాడ ఆడదానికి బైట పనేట్రా!? దాన్ని పాడుసేసి గుట్టు చప్పుడు కాకుండా ఇళ్ళకెల్లిపోదాం. ఎవలికి సెప్పొద్దు!" ఇంకోడు అన్నాడు.

సత్తిబాబు అందరి మాటలూ వింటున్నాడు. అందరి కన్నా ముందు నడిచాడు. ఆ ఆడమనిషి వద్దకు పరుగులాంటి నడకతో చేరుకున్నాడు.

"అంతా నీ వల్లే రా తుప్పాసెదవ!" రాధమ్మ కట్టలు తెంచుకున్న కోపంతో అరిచింది.

సత్తిబాబు అవాక్కయ్యాడు! ఓ పోలీసు సత్తిబాబుని పక్కకు పిలిచి....

"మీ అమ్మని కొంతమంది గ్యాంగ్ రేప్ చేశారయ్య!"

"ఏంటండీ?" అర్థం కానట్టు అడిగాడు సత్తిబాబు.

"అదేనయ్యా! కొంతమంది పాడు చేశారు!"

సత్తిబాబు తన తల్లికి ఏ గుండెపోటో, యాక్సిడెంటో అయ్యుంటుందని అనుకుంటున్నాడు. పోలీసు చెప్పిన సంగతి విని నిర్ఘాంతపోయాడు! వెంటనే రాధమ్మ దగ్గరకు పరుగెత్తాడు.

చిమ్మ చీకటి! ఎవరూ దరిదాపుల్లో లేరు! ఆమె విదిలించుకోడానికి ప్రయత్నం చేస్తోంది. ఐదుగురూ చాలా బలంగా పట్టుకున్నారు ఆమెను. ఆమె తెల్లని చీర మొత్తం రక్తమయమైంది. సత్తిబాబు ఆమెను పాడుచేసి మత్తుగా పడిపోయాడు. మిగతా నలుగురూ ఒకరి తర్వాత ఒకరు అఘాయిత్యం చేసి, ప్రతిఘటించినందుకు ఆమెను చితకబాదారు.

ఆ నలుగురూ సత్తిబాబుని లేపి ఇళ్ళకు బయల్దేరారు. మార్గమధ్యలో వారంతా వేరే వేరే దారుల్లో వెళ్ళిపోయారు. సత్తిబాబు మధ్యలోనే నడవలేక పడిపోయాడు.

◆◆◆

సూర్యోదయం! ఎండ సరాసరి సత్తిబాబు ముఖంపై పడుతూ వుంది. అతడికి కళ్ళు చురుక్కుమని తెరుచుకున్నాయి. రెప్పలు నలుపుకుంటూ లేచే ప్రయత్నం చేశాడు. రోడ్డు పక్కన గోడ దగ్గర చెత్తలో పడుకున్నాడు. ఓ కుక్క అతని పక్కనే మల విసర్జన చేయబోతుంటే దాన్ని తరిమి ఒక్కసారిగా లేచాడు. ఒళ్ళంతా విరిచి పెద్దగా ఆవలిస్తూ ఇంటి బాట పట్టాడు. ఇంటి దగ్గర గుంపులు గుంపులుగా జనం కనబడ్డారు. సత్తిబాబు పెద్దగా పట్టించుకోలేదు. వాళ్ల పేటలో ఏ చిన్న విషయం జరిగినా జనం పోగవడం సాధారణం. జనంలోంచి ఇద్దరు పోలీస్ కానిస్టేబుల్స్ సత్తిబాబు దగ్గరగా వస్తున్నారు...

'ఏటీ! కొంపదీసి నా ఇంటిది కానీ నన్ను పోలీసోళ్ళకి పట్టిత్తుందా?' ఆశ్చర్యపోతూ అనుకున్నాడు సత్తిబాబు.

"ఏమయ్యా! నువ్వేనా సత్తిబాబంటే!" అతడి అవతారం చూసి ఎంతో జుగుప్సగా అడిగారు కానిస్టేబుల్స్.

"అవునండయ్యా!" చేతులు కట్టుకుని వినయంగా సమాధానమిచ్చాడు.

"పద పద" అంటూ గుంపులోంచి అతడి ఇంటి ముందుకు తీసుకెళ్ళగానే... సత్తిబాబు చూసింది నమ్మలేకపోయాడు! ఉన్న అడుగు మడుగు మత్తు కూడా వదిలిపోయింది. నోటి వెంట మాటలేదు! రాధమ్మ, తన కూతురు చిన్ని వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. తన పేట వాళ్ళే కాక, చుట్టుపక్కల వాళ్ళు కూడా గుమిగూడారు. అందరూ సత్తిబాబునే చూస్తున్నారు. అతడు మాత్రం ఎదురుగా శవంగా పడి ఉన్న తన తల్లి పిచ్చమ్మనే చూస్తున్నాడు.

"అమ్మా...!" ఒక్క అరుపుతో తల్లి శవం మీద పడి ఏడవడం మొదలుపెట్టాడు సత్తిబాబు. చిన్ని ఆ అరుపుకి బెదిరిపోయింది! అతని ఆర్తనాదాలు ఆకాశాన్నంటాయి.

సత్తిబాబుకి అంతా చీకటైనట్టుంది. ఏమీ వినిపించట్లేదు.

"ఒరేయ్ సత్తి.... నేన్రా మీ అమ్మని!"

"నువ్వు ఎవడికి అమ్మవైతే నాకేటి!?"

ఇవే మాటలు మారు మోగుతున్నాయి.. అతడి చెవుల్లో, ఒక్కసారిగా కళ్ళు తిరిగాయి సత్తికి.

"నేన్రా అమ్మని! ఇంటికెల్దాం పదరా!" గుర్తొస్తున్న మాటలు....

సత్తిబాబు రక్త కన్నీరు కారుస్తున్నాడు!

"ఒసేయ్ రాధమ్మా! ఏంటైందే మాయమ్మకి? నిన్నటి దాకా బానే ఉంది కదెటే! నిన్న సందేలాకాడే దుర్గమ్మత్త ఇంటిగ్గూడా నడిసిపోయింది కదే?" గుండెలవిసేలా ఏడుస్తూ అడిగాడు సత్తిబాబు.

"అంతా నీ వల్లే రా తుప్పాసెదవ!" రాధమ్మ కట్టలు తెంచుకున్న కోపంతో అరిచింది.

సత్తిబాబు అవాక్కయ్యాడు! ఓ పోలీసు సత్తిబాబుని పక్కకు పిలిచి....

"మీ అమ్మని కొంతమంది గ్యాంగ్ రేప్ చేశారయ్యా!"

"ఏంటండీ?" అర్థం కానట్టు అడిగాడు సత్తిబాబు.

"అదేనయ్యా! కొంతమంది పాడు చేశారు!"

సత్తిబాబు తన తల్లికి ఏ గుండెపోటో, యాక్సిడెంటో అయ్యుంటుందని అనుకుంటున్నాడు. పోలీసు చెప్పిన సంగతి విని నిర్ఘాంతపోయాడు! వెంటనే రాధమ్మ దగ్గరకు పరుగెత్తాడు.

"ఏటి రాధమ్మ? మాయమ్మని పాడుచెయ్యడమేమిటే"? ఏడుస్తూ అడిగాడు.

"అవునయ్యా! అద్దరేత్రి కాడ రోడ్డు పక్క పొదల్లో పడుంటే యంకటేశు, రమేసు చూసి ఎత్తుకొచ్చారు! ఆసుపత్రికి తీస్కెళ్లి పోలీసుల్ని పిలిపించి ఏటేటో సేసారయ్యా!" దు:ఖం పొంగుకొస్తుంది రాధమ్మకు.

"తప్పుడు మాటలాడకే రాధమ్మ! సీరేత్తాను! మా అమ్మ రేత్రి కాడ రోడ్లమ్మట ఎందుకే తిరుగుతది?"

"నీ వల్లేనయ్యా!!! ముదనష్టపోడు! యక్కడో తప్పతాగేసి పడిపోయుంటాడత్తా! పొద్దున్నే వత్తాడ్లే నువ్ నిద్రో!" అన్నాను.

నా మాట ఇనకుండా బయటికెళ్ళింది నిన్ను ఎతుకులాట్టాకి. నిన్ను ఎవడన్న కొట్టాడో తెల్దు లారీయో ఆటోనో గుద్దీసిందో తెల్దు! కంగారడిపోయింది మీయమ్మ"

"ముసల్ది బయటికొత్తే నువ్వెవడితో కులుకుతున్నావే నెంజ!" రాధమ్మ మెడ వంచి వీపు మీద బాదాడు సత్తిబాబు.

పోలీసులు జనాన్ని తొలిగించే పనిలో నిమగ్నమై ఉన్నారు.

"నీ కూతుర్ని ఎవడు సూస్కుంటాడ్రా గుడిసేటన్నాయాలా! పిల్లనిడిసి ఎలా గెల్లమంటావ్? ఆళ్ళు మీయమ్మని ఇంటిదాకా మోసుకొచ్చేకాడికి కొనూపిరితో నుంది. ఆటోక్కూడా డబ్బుల్లేకుండా మొత్తం తాగటాకట్టుకెళ్ళావ్! నానా తిప్పలు పడి, తీస్కెళ్లేక ఆడ సచ్చిపోయిందిరా యదవ! మీ అమ్మని నువ్వే పొట్టనెట్టుకున్నావురా! మాయదారి సచ్చినోడ దూ! నీ నోట్లో మట్టి గొట్ట!"

"అయ్యో! ఏటి సేసావ్రా దేవుడా!"

సత్తిబాబుకి నమ్మశక్యం కావట్లేదు. తల్లి మరణానికి ఇంత దౌర్భాగ్యమైన కారణాన్ని ఒప్పుకోలేకపోతున్నాడు. వెంటనే పోలీసు దగ్గరికి పరుగెత్తాడు.

"అయ్యా! నాకేటీ బుర్రకెక్కుతాలేదండయ్యా! మా అమ్మకి దెబ్బై నాలుగేళ్లయ్యా! ముసల్దాన్ని ఎవడు పాడు సేత్తాడయ్యా? రెండు సేతులు కలిత్తేనే కదయ్యా తప్పట్లు? ఇంకేదో జరిగుంటదయ్యా!"

శరీరమంతా తెల్లని గుడ్డతో చుట్టేసి మొహం మాత్రమే కనిపిస్తున్న తల్లిని చూసి రోదిస్తూ అడిగాడు సత్తిబాబు.

"నీ బాధ నేను అర్థం చేస్కోగలను బాబు! మీ

అమ్మకి అన్ని పరీక్షలు చేసాం. మొత్తం ఐదుగురి పళ్ళగాట్లు, గోటిగాట్లు, పాడు చేశారని ఆధారాలూ ఉన్నట్లు రిపోర్ట్ వచ్చింది. ఆమె ఎదురు తిరగడంతో వాళ్ళు బాగా కొట్టారు. మీ అమ్మ మర్మాంగం బాగా దెబ్బతింది చాలా రక్తం పోయింది. బతికే ఉంటే కనీసం పద్దెనిమిది కుట్లు పడేవి. ఈ వయసులో ఆమెకంత కష్టం ఇవ్వకుండా దేవుడు మేలే చేశాడు. ఆమె వాళ్ళకంటే ముందు నిన్ను చూసినా బాగుండేది! ఎవరు చేశారో తెలీదు! చూసిన వాళ్ళు లేరు! బాధితురాలు చనిపోయింది. నీకెవరి మీదైనా అనుమానం ఉంటే చెప్పు. ఇంటి గుమ్మం నుంచే "ఒరేయ్ సత్తీ"... అని పిలుచుకుంటూ నిన్ను వెతకడం మొదలు పెట్టిందనీ నీ భార్య చెప్తుంది." అన్నారు పోలీసులు.

సత్తిబాబుకి అంతా చీకటైనట్టుంది. ఏమీ వినిపించట్లేదు.

"ఒరేయ్ సత్తి.... నేన్రా మీ అమ్మని!"

"నువ్వు ఎవడికి అమ్మవైతే నాకేటే!?"

ఇవే మాటలు మారు మోగుతున్నాయి.. అతడి చెవుల్లో, ఒక్కసారిగా కళ్ళు తిరిగాయి సత్తికి.

"నేన్రా అమ్మని! ఇంటికెల్దాం పదరా!" గుర్తొస్తున్న మాటలు....

సత్తిబాబు రక్త కన్నీరు కారుస్తున్నాడు!

◆◆◆

శవాన్ని స్మశానానికి తరలించి, కట్టెలు, పిడకలపై పడుకోబెట్టారు. సత్తిబాబు చేయాల్సిన కార్యాలన్నీ చేస్తున్నాడు. అతడి మొహం నెత్తురు చుక్క లేకుండా ఉంది. కన్నీరు లేదు! కదలిక లేదు! కర్రతో చితికి నిప్పంటించాడు.. భగ్గున మండుకుంది. తన తల్లి కాలిపోతోంది. చుట్టుపక్కన ఏడుపులు, పెడబొబ్బలు వినిపించడం లేదు. అందరూ తిరుగు ప్రయాణం పట్టారు. తన కూతుర్ని, భార్యని చూశాడు. ధారాళంగా ఏడుస్తున్నారు. స్మశానంలోని పనివాళ్ళు చితికి ఆజ్యం పోస్తున్నారు. మంటలు ఉవ్వెత్తున ఎగిసి పడుతున్నాయి. సత్తి తన చేతిలో ఉన్న కర్రను కింద పడేసి ఒక్క ఉదుటున తల్లి చితిలోకి దూకేశాడు!

నల్లని పొగలోంచి సత్తిబాబు ప్రాణం పైకి లేచింది....

చితి మీద సైతం ఘోర అవమానంతో తల్లి ఆత్మ విలపిస్తోంది!!

తల్లి చితిలో కాలుతున్న సత్తిబాబు సిగ్గుతో చావలేక, మంచి మనిషిగా మారిపోలేక తన చావులో అత్యాచారం లాంటి నరకాన్ని చూశాడు!

తల్లి శవంతో శవమై మంటల్లో బూడిదై ఆహుతయ్యాడు.

◆◆◆

"సుజీ ఇవ్వాళ్ళ పేపర్ చూశావా? తల్లి మరణం భరించలేక ఆమె చితిలోనే బూడిదైన కొడుకు! అనంతప్రేమకు నిదర్శనం. నిన్న వెళ్ళాను కదా... అదే కేసు! పాపం! మేం చూస్తుండగానే దూకేశాడు. మంటలు ఎగిసి పడటంతో కాపాడలేకపోయాం. వాళ్ళమ్మంటే పిచ్చి ప్రేమ అతనికి. నిన్న చూడాల్సింది అతని బాధ. మాటల్లో చెప్పలేను!" కళ్ళు తుడుచుకుంటూ రోజు ప్రారంభించాడు పోలీసు ఆఫీసర్. ✦

మనసున్న మనుషుల మానసిక సంఘర్షణే "స్ఫూర్తి"

కొత్త పుస్తకాలు

స్ఫూర్తి
తంబళ్ళపల్లి రమాదేవి
వెల: 100/-
పేజీలు: 174/-
ప్రతులకు: విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ 33-33-2, చంద్రం బిల్డింగ్స్, చుట్టుగుంట, విజయవాడ

మధ్యతరగతి కుటుంబ జీవనం చుట్టూ నడిచిన కథ ఈ నవల. కథ పాతదే అయినా నడిపించిన తీరు కొత్తగాను, ఆసక్తికరంగానూ వుంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఇది మనసున్న మనుషుల మానసిక సంఘర్షణ. అంతేకాకుండా రచయిత్రి తంబళ్లపల్లి రమాదేవి 'స్ఫూర్తి' నవలలో భార్యాభర్తల వ్యక్తిగత జీవితంలోని అన్ని కోణాలనూ చిత్రించారు. రమాదేవికి ఇది రెండవ నవల. ఇంతకుముందు 'మధులిక' అనే నవలను రచించారు. పెట్టుబడిదారీ వ్యవస్థలో వస్తున్న మార్పులు ఉమ్మడి కుటుంబాలపైన, కుటుంబ జీవనంపైనా ఎలాంటి ప్రభావం చూపుతుంది, తెచ్చిపెట్టుకున్న ఆధునిక పోకడల వల్ల కుటుంబాలు ఎలా విచ్ఛిన్నమైపోతాయో రచయిత్రి చక్కగా వివరించారు. ముఖ్యంగా ఈ నవలలో కీలకమైన మూడు పాత్రలూ మహిళలే కావడం విశేషం. ఒకరు తెచ్చిపెట్టుకున్న ఆధునికతతో డాంబికాలు ప్రదర్శించే అత్తగారు. ఎంతసేపూ ఎదుటివారిలో తప్పొప్పులు వెదికి, వారిని చులకనగా చూసే స్వభావం. తన వల్ల ఉమ్మడి కుటుంబం విచ్ఛిన్నమైనా పట్టించుకోని అహంభావి. లాప్‌టాప్ కొనిచ్చినందుకు తల్లి బుగ్గపై ముద్దుపెట్టిన కూతురుతో "అబ్బ చాల్లే.. ఈ ముద్దు ముచ్చటలకేం తక్కువలేదు చీప్‌గా" అంటుంది. తల్లీ పిల్లల మధ్య ఉన్న అనుబంధాన్ని వ్యక్తీకరించే తీరును కూడా ఆమె చీప్‌గా చూస్తుంది. ఇక రెండో పాత్ర కాత్యాయిని. ఈమె జానకి ఆడబిడ్డ. ఆమెకు తన మేనల్లుడంటే పంచ ప్రాణాలు. అతనికి దూరం కావడం ఇష్టంలేక మంచిమంచి సంబంధాలను కూడా వదులుకొని పక్క ఊరులోని ఓ సాధారణ రైతును పెళ్లి చేసుకుంటుంది. ఆ విధంగానైనా తన మేనల్లుడు తనకు దగ్గరగా వుంటాడని భ్రమపడుతుంది. ఒక మూడవ పాత్ర, ముఖ్యమైన పాత్ర రమ్య. జానకి పెద్ద కోడలు. ఐఎఎస్‌కు ప్రిపేర్ అవుతోన్న ఓ మధ్యతరగతి అమ్మాయి. భార్యగా, కోడలిగా, వదినగా, సోదరిగా రమ్య పాత్రను మూర్తీభవి ంచిన వ్యక్తిత్వంతో తీర్చిదిద్దారు రచయిత్రి. తనకంటే చిన్నవారిని, పెద్దలను సహితం దారిలో పెట్టడానికి ఒక స్త్రీ పడే తపనను, తన మానసిక సంఘర్షణను మన కళ్లముందు ఆవిష్క రించారు. ఈ మూడు పాత్రల్లోనూ వారివారి వ్యక్తిత్వాల చిత్రణలో చివరి వరకూ ఎక్కడా బిగి సడలకుండా నడిపించిన తీరు... వారి అంతరంగ సంఘర్షణను అక్షరీకరించిన వైనం ఆసక్తి కరంగా వుంటుంది. ఇంటిని సంస్కరించడానికి పూనుకున్న రమ్య మొదట భర్త శేఖర్ సహకారాన్ని కోరుతుంది. "నువ్వో అపురూపమైన అద్వితీయమైన అమ్మాయివి. నువ్వేం చేసినా అందులో ఏదోక మంచి దాగివుంటుంది. నువ్వు నాకసలు చెప్పిచేసినా, చెప్పకుండా చేసినా నేనేం అనుకోను. నీ మీద ఎంత ప్రేమ వుందో... అంత నమ్మకమూ వుంది" అంటూ ఆమెకు పూర్తిగా సహకరిస్తాడు. కుటుంబ జీవనంలో వుండే ఆటుపోట్లు, అత్తగారి అసహనాలు, అన్నదమ్ముల ఆప్యాయతలు, అనురాగాలు, అక్కడక్కడ ప్రేమ మైకాలు చదువరులను ఆకట్టు కుంటుంది. మనస్సును ఆహ్లాదపరుస్తుంది. ఒక తరంలో కోడలి పోకడ వల్ల విచ్ఛిన్నమైన ఉమ్మడి కుటుంబం... తర్వాతి తరంలోని మరో కోడలివల్ల సరిదిద్దబడుతుంది. 'స్ఫూర్తి' పేరుతో ఒక సీరియల్ రాస్తూ తమ కుటుంబ సభ్యులకు కనువిప్పు కలిగించే ప్రయత్నం చేస్తుంది.

- రాజాబాబు కంచర్ల

సంపూర్ణ పోషకాహారం
ఫ్రూట్స్
రచయిత: శ్రీ వాసవ్య
వెల: 125/-
పేజీలు: 256/-
ప్రతులకు: శ్రీ బాలాజీ పబ్లికేషన్స్, విజయవాడ-2

చార్వాక దర్శనం
డా॥ కత్తి పద్మారావు
వెల: 200/-
పేజీలు: 231/-
ప్రతులకు: కత్తి స్వర్ణ కుమారి, లోకాయత ప్రచురణలు, లుంబినీ వనం, పొన్నూరు

పొట్లకాయ వెరైటీలు

మసాలా కూర



కావాల్సిన పదార్థాలు: పొట్లకాయ- ఒకటి, ఉల్లిపాయ- ఒకటి, వేరుశెనగపప్పు-1/2 కప్పు, కొబ్బరి ముక్కలు-1/2 కప్పు, పసుపు-1/4 టీ స్పూను, ఆవాలు-1/2 టీ స్పూను, జీలకర్ర-1/2 టీ స్పూను, నూనె-మూడు టీ స్పూన్లు, అల్లం వెల్లుల్లి పేస్ట్- ఒక టేబుల్ స్పూను, గరం మసాలా- ఒక టీ స్పూను, కారం-ఒక టీ స్పూను, ఉప్పు- రుచికి సరిపడా, నీళ్ళు- ఒక కప్పు

తయారీ

పొట్లకాయ పై పొట్టు గీసి గుండ్రంగా ముక్కలు కోసుకోవాలి. వేరు శెనగపప్పులు వేగించుకొని కొబ్బరితో కలిపి మెత్తగా రుబ్బుకోవాలి. బాణలిలో నూనె వేసి ఆవాలు, జీలకర్ర, ఉల్లిపాయ ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్టు వేగించాలి. తరువాత పొట్లకాయ ముక్కలు వేసి అవి కొంచెం ఉడికాక వేరుశెనగ కొబ్బరి పేస్టు, ఉప్పు, పసుపు, కారం వేసి నీళ్ళు పోసి ఉడికించాలి. కూర దగ్గర పడ్డాక గరం మసాలా జల్లి దించేయాలి.

పెరుగు పచ్చడి

కావాల్సిన పదార్థాలు

పొట్లకాయ- చిన్న ముక్క
పెరుగు- ఒక కప్పు
పచ్చిమిర్చి- నాలుగు
జీలకర్ర- ఒక చెంచా
పచ్చికొబ్బరిపొడి- రెండు చెంచాలు
కొత్తిమీర- అరకప్పు
ఆవాలు- రెండు చెంచాలు
అల్లం వెల్లుల్లి ముద్ద- చెంచాడు
మినప పప్పు- చెంచాడు
ఎండు మిర్చి-ఒకటి
కరివేపాకు- రెండు రెమ్మలు
పసుపు, ఉప్పు- తగినంత
ఇంగువ- కొద్దిగా

తయారీ

ముందుగా పొట్లకాయ ముక్కలు కడిగి ఉడికించి పెట్టుకోవాలి. పై దినుసులతో ముద్ద చేసుకోవాలి. ఒక గిన్నెలో పెరుగు తీసుకొని దానిలో పైన తయారు చేసిన ముద్ద, పొట్లకాయ ముక్కలు వేసి తగినంత ఉప్పు కలిపి తాలింపు చేసుకోవాలి. అందులో చిటికెడు పసుపు, ఇంగువ వేసి చల్లారాక పెరుగులో కలుపుకోవాలి. బాగా కలుపుకుంటే కమ్మని పెరుగు పచ్చడి రెడీ!

ఆవకూర

కావాల్సిన పదార్థాలు

పొట్లకాయ ముక్కలు- రెండు కప్పులు
నువ్వులు- రెండు చెంచాలు
ఎండు మిర్చి-నాలుగు
ఆవాలు- రెండు చెంచాలు
నూనె- నాలుగైదు చెంచాలు
ఉప్పు- తగినంత
పసుపు- కొద్దిగా

తయారీ

బాణలిలో నూనె వేడిచేసి అర చెంచా ఆవాల్ని వేయించుకోవాలి. ఇప్పుడు కడిగిన పొట్లకాయ ముక్కలూ, పసుపూ వేసి మూతపెట్టేయాలి. మధ్య మధ్య కొద్దిగా నీళ్లు చల్లుతూ ఉంటే కూర మగ్గుతుంది. ఇంతలో పొయ్యి మీద మరో బాణలి పెట్టి నూనె లేకుండా నువ్వుల్ని వేయించుకుని తీసుకోవాలి. వేడి చల్లారాక నువ్వులూ, మిగిలిన ఆవాలు నానబెట్టిన ఎండుమిర్చి తీసుకుని మెత్తని మిశ్రమంలా చేసుకోవాలి. కూర పూర్తిగా మగ్గాక తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. మంట తగ్గించి ముందుగా చేసి పెట్టుకున్న ఆవ మిశ్రమాన్ని వేసి కలిపి వెంటనే దింపేస్తే కమ్మని పొట్లకాయ ఆవకూర సిద్ధం.

పల్లీ పొడితో కూర

కావాల్సిన పదార్థాలు

పొట్లకాయ - ఒకటి, ఉల్లిపాయ తరుగు-అరకప్పు, ఆవాలు,జీలకర్ర, మినపప్పు, శనగపప్పు-అర టీ స్పూను చొప్పున, ఉప్పు-తగినంత, నూనె-ఒక టేబుల్ స్పూను, ఎండు మిర్చి-ఆరు, వెల్లుల్లి రేకలు-ఆరు, వేరుశెనగపప్పులు- అరకప్పు, కరివేపాకు-నాలుగు రెబ్బలు, పసుపు-అర టీ స్పూను, ఇంగువ-చిటికెడు, కొత్తిమీర తరుగు-అరకప్పు

తయారీ

పొట్లకాయని ముక్కలుగా తరిగి చిటికెడు పసుపు కలిపి, కప్పు నీటితో ఉడికించాలి.(ముక్క సగం ఉడికితే చాలు) ఎండుమిర్చి, వేరుశనగపప్పులను విడివిడిగా వేగించి వెల్లుల్లితో కలిపి పొడి చేయాలి. నూనెలో తాలింపు దినుసులు, కరివేపాకు, ఇంగువ, పసుపు, ఉల్లితరుగు వేగించి ఉడికిన ముక్కలు కలపాలి. ఐదు నిమిషాలు మగ్గించి ఉప్పు, వేరుశనగ పొడి మిశ్రమం కలిపి మరో రెండు నిమిషాలు ఉంచి కొత్తిమీర చల్లి దించేయాలి.

పక్షి బొమ్మ ను గీద్దామా

ఆర్టిస్టు అంకుల్ ఈ వారం పొడుగు ముక్కు పక్షి బొమ్మను ఎలా గీయాలో నేర్పిస్తాడట. రెడీనా మరి.



తేడా ఏది?

ఈ చిత్రంలో అగుపిస్తున్న నాలుగు ఎలుకలు ఒకేలా ఉన్నా... ఇందులో ఒకటి మాత్రం తేడాగా ఉన్నది. అదేదో రాయండి.



రంగులేద్దామా

పిల్లలు సరదాగా పార్క్‌కెళ్లి... చిన్ని రైలుతో ఆడుకుంటున్నారు. అయితే ఈ చిత్రంలోని బొమ్మలకు మేం చెప్పిన రంగులు వేయండి.



బుజ్జి స్టార్

హాయ్ ఫ్రెండ్స్ నేను తెలుగులో ఈగలాంటి పలు సినిమాల్లో నటించాను. ఇది నా చిన్ననాటి ఫోటో. ఇంతకీ నేనెవరో గుర్తించండి?

ఎక్కడున్నాయి?

అందరూ గేలం వేసి చేపలు పడతారు. ఇక్కడ తమాషా చూడండి. చేపలే సరదాగా గాలం వేస్తున్నాయి. అయితే ఈ చిత్రంలో దిగువన ఉన్న బొమ్మలు పైచిత్రంలో ఎక్కడున్నాయో గుర్తించి, సున్నా చుట్టేయండి



పదాలు కనిపెడదాం

ఈ చిత్రంలో చాలా పదాలు దాగున్నాయి కదూ. ఈ పదాలు మొత్తం సముద్రపు జీవులు కావడం విశేషం. నిలువుగా, అడ్డంగా, వంకరగానైనా వాటిని గుర్తించండి.

sea
fish
whale
water
wet
seal
blue

w	f	b	s	w
e	i	r	e	a
t	s	e	a	t
w	h	a	l	e
b	l	u	e	r



ఆకులతో ....

బంతీ ఎండు ఆకులతో సీతాకోక చిలుక బొమ్మను చాలా చక్కగా తయారుచేశాడు కదూ. అయితే మీరు కూడా ఓ బొమ్మను చేసేయండే.



పేపర్ ప్లేట్ చేపలు



పిల్లలూ మీకు ఎక్వేరియంలో పెంచే రంగు రంగుల చేపలంటే ఎంతో ఇష్టం కదా! వాటి కదలికలను గమనిస్తూ వాటితో ఆడుకోవాలంటే అది సాధ్యపడదు. చేపలను సాధారణంగా మనం చెరువుల్లో, చిన్న చిన్న నీటి కొలనుల్లో చూస్తుంటాం. వాటిని మనం పట్టుకునే లోపు అవి పారిపోతుంటాయి. లేదా ఎక్కడైనా షాపుల్లో పెద్ద పెద్ద అక్వేరియమ్‌లు పెడితే... వాటిని చూసి సంతోషిస్తాం. మరి అలాంటి అందమైన రంగురంగుల చేపల బొమ్మలను తయారు చేస్తే... ఎలా వుంటుంది? చాలా బావుంటుంది కదూ. వాటితో ఎంచక్కా... మీ రూమ్‌ని కూడా డెకరేట్ చేసుకోవచ్చు.

తయారు చేయటానికి కావలసినవి

పేపర్ ప్లేట్, టేపు, కత్తెర, కలర్ పెన్సిల్/ స్కెచ్ పెన్సిల్, గమ్, రంగులు

తయారుచేసే పద్ధతి

ముందుగా మీకు నచ్చిన కలర్ పేపర్ ప్లేట్‌ని తీసుకోండి. లేదా నచ్చిన రంగుని తెలుపు ప్లేట్ మీద వేయండి. కత్తెరతో త్రిభుజాకారంలో కత్తెరించండి. ఈ త్రిభుజాన్ని ప్లేట్ వెనుక భాగంలో టేపుతో చేప తోక ఆకారంలో అతికించాలి. ఇప్పుడు స్కెచ్ పెన్‌తో చేప కన్ను గియ్యాలి. మనకిష్టమైన విధంగా దానిపై డ్రాయింగ్ వేసుకోవాలి. అంతే పేపర్ ప్లేట్ చేప రెడీ! టోపీలు, పూలు తయారు చేసి గమ్‌తో వీటిపై అతికించుకోవచ్చు. రంగు రంగుల పేపర్ ప్లేట్స్‌తో చేపలను తయారు చేసి మీ రూమ్‌ని ఇలా డెకరేట్ చేసుకోండి.

పదవికాసం - 4

కూర్పు: టి.డి. ప్రసాద్

1		2	3		●	4		5	●
	●	6		●	7		●	8	9
10				●	11		12	●	
	●	●	13		●	●	14	15	
●	16			●	17		●		●
18		●	19	20		●	21		22
	●	23	●	24		25	●	26	
●	27	●	28	●	●	29	30	●	
31		●	32	33	34	●	35	36	
37			●	38			●		●

ఆధారాలు

అడ్డం

1. రావడాలు, పోవడాలు (5)
4. చేవ్రాలు (3)
6. స్వప్నం (2)
7. హిందీలో అమ్మ (2)
8. మోసం (2)
10. 'పగ' ఉంది..'డాలు'ఉంది.. రెంటినీ కలిపితే (4)
11. 'మాఘమాసంలో' 3,4.1, (3)
13. చూచు, ప్రసవించు (2)
14. బొందుబెండు చెట్లు (3)
16. కథ రాసే విధానం (3)
17. మగని మాత, భార్య తల్లి (2)
18. నూలు వడికేది (2)
19. చివర కోల్పోయిన చివరి మాసం (3)
21. మంత్రి (3)
24. సరిపోక (3)
26. తలుపులు మూశాక పెట్టేది (2)
29. '-- లో షికారు కెళ్లే పాలబుగ్గల పసిడిదానా..'లో మిస్సయిన వాహనం (2)
31. అగ్ని పర్వతం బద్దలైతే వచ్చేది (2)
32. దిక్కుగా, ఆశగా (3)
35. రూపం (3)
37. చిన్నపాటి నిద్ర, తూగు (3)
38. అల (3)

నిలువు

1. దేశాధ్యక్షుడు (4)
2. రాకడా..కు వ్యతిరేకం (3)
3. అబ్దుల్ కలాం సందేశం (6)
4. ఆనందం (3)
5. '--కు లేని దురద కత్తిపీటకు ఎందుకు'? (2)
7. తల్లి సోదరుని పిలవండి (2)
9. నూనె తీసే యంత్రం (3)
12. పదవి పోయాక అవుతారు (2)
15. గవాక్షాలు పైకె (4)
16. ఆడపెళ్లివారిచ్చేది (2)
17. అతివ, బలహీనురాలు (3)
18. శిల (2)
20. సెంటుభూమి చాలక 1,5 (2)
22. మాట చమత్కారం (4)
23. ఆంగ్లంలో మోకాలు (1)
25. కకావికలం చివరి వరకు లేదు (2)
27. సైనికుడు (3)
28. సినిమాలకు రాష్ట్ర ప్రభుత్వమిచ్చే ప్రతిష్ఠాత్మక అవార్డు (2)
30. తలకిందులైన ఆరు (2)
31. పడవలు వెళ్లేందుకు కాలువలో ఏర్పాటు చేసింది (2)
33. నూరు (2)
34. శవాలు లేని శవాగారం (2)
36. కాకినాడ స్వీటు (2)

సుడోకు

నిలువుగా, అడ్డంగా ఉన్న ప్రతి వరుసను 1 నుంచి 9 అంకెలతో పూరించాలి. ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. నలు చదరపు బాక్సులు తొమ్మిది ఉన్నాయి. ప్రతి బాక్సులోనూ 1 నుంచి 9 అంకెలు ఉండాలి.

	5	3	2		7			8
6		1	5					2
2			9	1	3		5	
7	1	4	6	9	2			
	2						6	
			4	5	1	2	9	7
	6		3	2	5			9
1					6	3		4
8			1		9	6	7	

గతవారం జవాబు

1 న	2 క్ష	3 త్ర	ము	●	4 కా	5 లు	6 వ	●	7 వే
●	8 మా	య	●	9 బిం	●	10 క	ల	నే	త
11 క్రో	ప	ము	12 లో	●	13 కా	న	●	●	నం
14 రు	ణ	●	15 తె	16 గు	వ	●	17 జ	18 పం	●
ము	●	19 మొ	క్కు	బ	డి	●	20 లం	ది	21 ప
●	22 అ	రు	వ	ది	●	23 త	●	24 రి	క్షా
25 ప	రు	గు	●	26 డి	27 పో	●	28 కౌ	●	లు
29 త	గు	●	30 లు	●	31 లీ	జు	●	32 నా	●
కం	●	33 కొం	●	34 కా	సు	●	35 ఎ	న్నా	36 రై
●	37 మం	చం	కో	డు	●	38 మ	ర	మ్మ	తు

ఈ దృశ్యం చూడగానే గుండె కలుక్కుమందా? కానీ వాళ్ల కన్నవారికి మాత్రం ఆ బిడ్డ పరిస్థితి రవ్వంత కూడా పట్టడం లేదు. వాడికేమైనా అంటు వ్యాధి సోకిందా, అరుదైన రోగం తినేస్తోందా? లేదే. మరి వాడిలో ఇంకేమైనా లోపముందా?

గుండె కలుక్కుమందా?

చూడండి కింద ఫొటోలో ఎంత అందంగా నవ్వుతున్నాడో. పసిమొగ్గల్ని కబళించే పిశాచంలా తయారైంది అక్కడి సమాజం. వీడిది పిశాచ అంశట.! వీడి పుట్టుక వల్ల పంటలు మాడిపోతాయట, కుటుంబం కూలిపోతుందట, గ్రామం తగలబడి పోతుందట! అలా నిర్ణయించేది, ముద్ర వేసేది సమాజమైతే ఇలా శిక్షించాల్సిన భారాన్ని కన్నవారిపైనే మోపుతుంది. నెలలు నిండని పసిపాపల్నీ తల్లిదండ్రులే హింసించి చంపాలి. నిర్జన ప్రాంతాల్లోనో, ఊరి ఆవలో చావుకు వదిలేయాలి. ఆకలితో అల్లాడిపోతున్నా బురద నీళ్లు కూడా ఇవ్వకూడదు. మల మలా మాడి వాళ్లు కన్నుమూశారా సరే లేకుంటే సజీవంగానే మట్టిలో పూడ్చిపెట్టేస్తుంది అక్కడి సమాజం. ఎవరైనా ఎదురు చెబితే ... వారికీ అదే గతి పట్టిస్తారు మత ప్రచారకులు. అంగోలా నుంచి కాంగో వరకు వేలాది మంది చిన్నారులు ఈ దారుణ మారణకాండలో ఏటా బలైపోతున్నారు. ప్రస్తుత సన్నివేశం నైజీరియా అక్వా ఇబోమ్ ప్రాంతంలోని ఓ గ్రామంలో చోటుచేసుకుంది. రెండేళ్లు కూడా నిండని ఈ చిన్నారి డెన్మార్క్‌కు చెందిన స్వచ్ఛంద సేవకురాలు అంజా రిన్‌గ్రెన్ లోవెన్‌కు గత నెల 31న కంటబడ్డాడు. 'విచ్ చిల్డ్రన్'గా పిలిచే ఇలాంటి పిల్లల్ని కాపాడే మిషన్‌పై పని చేస్తున్నారామె. దుఃఖాన్ని అదిమిపట్టి, కోపాన్ని ఆపుకుని ఆమె వెంటనే వాడికి సపర్యలు చేసింది. తమ హోమ్‌కు తరలించి చికిత్సనందించింది. 'హోప్' అని వాడికి పేరు పెట్టి హోమ్‌లోని మిగతా పిల్లల జట్టులో చేర్చింది. ఇప్పుడిప్పుడే హోప్ కోలుకుంటున్నాడు. అంధ విశ్వాసాలతో కన్నబిడ్డల్నీ కాలరాస్తున్న అక్కడి సమాజం ఎప్పుడు కోలుకుంటుందో!

జైన్®

జైన్ ఇరిగేషన్ సిస్టమ్స్ లిమిటెడ్

1-1-782/బి/5, పార్క్ ఎదురుగా, గాంధీనగర్, హైదరాబాద్ - 80,

ఫోన్ : 040-2761 4474, 24654681, 9440797846.

Email : jainhyderabad@jains.com, Website : www.jains.com

చిట్టి చిట్టి చిత్రాలు

మినియేచర్ ఆర్టిస్ట్ బ్రూక్ రోత్‌షాంక్‌కు మూడేళ్ల చిన్న కొడుకుతోనే రోజంతా గడిచిపోయేది. వాడికి జోల పాడి నిదురపుచ్చేదో లేదో పెద్దోడు బడి నుంచి మమ్మీ అంటూ పరిగెట్టుకు వచ్చేవాడు. వాడికీ ప్రేమ పంచాలి కదా. ఇక రోజులో కళకు ఖాళీ ఏముంటుంది. భర్త జస్టిన్ సెరామిక్ కళాకారుడు కావడంతో అమెరికా అంతా బ్రేక్ లేకుండా చుట్టొస్తుంటాడు. అందుకే పిల్లల బాధ్యత కొన్ని రోజులు బ్రూక్‌వే. కానీ పెన్సిల్ తనను తాకాలని జారుకుంటూ వంటగదికి వచ్చేసేది. క్యాన్సన్ యాంటిక్ కాగితం రెపరెపలు డ్రాయింగ్ రూమ్‌ను దాటుకుని వినిపించేవి. కళాఖండాల్ని సృజించి సృజించి మరింత వాటి మత్తులోకి వెళ్లిన బ్రూక్ ఓ ప్రత్యామ్నాయం ఆలోచించింది. రోజువారి ఇంటి పనుల్లో తనను సతాయించేవి, ఎదురుపడేవి, నిదుర చెడగొట్టేవి, పదే పదే గుర్తొచ్చేవి ఏవో గమనించి వాటిలో ఒక్కో వస్తువును ఒక్కో రోజు మినియేచర్ ఆర్ట్‌లో అరెస్ట్ చేయడం మొదలెట్టింది. అలా రోజుకు నలభై నిమిషాల నుంచి నాలుగు గంటల పాటు తీరిక దొరికనప్పుడల్లా బుల్లి పెయింటింగ్‌ల్ని వేసేది. ఇవి ఎంత చిన్నగా ఉంటాయంటే నాణెం కూడా పెద్దగా కనిపిస్తుంది. ఇంత చిన్న పెయింటింగుల్లో డిటైల్స్ మిస్సవకుండా చివరకు అవి ఎలా నీడను ఏర్పరుస్తాయో అలా షేడ్ చేసేసింది. రెండేళ్ల క్రితం నుంచి మొన్నామధ్య వరకు ఇలా కొన్ని వందల ఏక చిత్రాలతో తన కళా హృదయాన్ని ఏమార్చింది. వీటిని ఫొటోలు తీసి తమ వెబ్‌సైట్‌లో పెట్టింది. ఆమె పూర్వ కళాఖండాల స్థాయి స్పందన వీటికీ దక్కడంతో బ్రూక్ ఉబ్బితబ్బిబవుతోంది. మెయిన్‌లోని ఇంటర్నేషనల్ గిల్డ్ ఆఫ్ మినియేచర్ ఆర్టిసన్స్ స్కూల్‌లో ఒకప్పటి విద్యార్థి అయిన బ్రూక్ ఇప్పుడు అదే స్కూల్లో యువ కళాకారులకు మినియేచర్ పాఠాలు చెబుతోంది. ఈ 1/12 పెయింటింగ్‌లు ఆమెకు 11 ఏళ్ల వయసపుడు పరిచయమయ్యాయి. షికాగోలోని టామ్ బిషప్ మినియేచర్ ఆర్ట్ షోకు బ్రూక్‌ను తల్లి చేయి పట్టుకుని తీసుకెళ్లింది. చూసి చూడగానే వాటితో ప్రేమలో పడిపోయిన బ్రూక్ ఇలా రోజూ ఆ చిత్రాల్ని గీస్తూ లవ్ యూ చెబుతోంది. ★







Check List

Book Number	KNSR02B110	Date	03/09/22
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	NO		
Missing Pages	NO		
Prepared By	Mounika	Cutting By	Mouni
Scanned By	Shameena	Pages	29